ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ జిల్లా వార్తలు

బుధవారం 23 జూలై 2025 | 5



సెటిల్ చేసుకోకపోతే షాప్ సీజ్ చేస్తాం!

ఉమ్మడి జిల్లా పరిధిలోని మెడికల్ షాపుల నిర్వాహకులకు ఫేక్ కాల్స్ 7

ఇక శ్రావణానందమే!

- 26 నుంచి శ్రావణమాసం
- మోగనున్న పెళ్లి బాజాలు



అన్నవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం వచ్చిందంటే ఆ సందడే వేరు.. ప్రతి ఇంటా పండగే.. ప్రతి ఇంటా లక్ష్మీ సందడే.. రావమ్మా మహాలక్ష్మి రావమ్మా అంటూ మహిళలు పెద్ద ఎత్తున వరలక్ష్మీ వ్రతాలు ఆచరించడం ఆనవాయితీ.. అంటే కాకుండా ఈ మాసం అంతా శుభప్రదంగా ఉంటుందనేది భక్తుల నమ్మకం. ఏ కార్యక్రమైనా ఈ మాసంలోనే తలపెడుతుంటారు. సుమారు 40 రోజుల తరువాత ఈ నెల 26 నుంచి శుభ ముహూర్తాలు జోరందుకోనున్నాయి. మూఢం, ఆషాఢం ఒకేసారి రావడంతో జూన్ 6 తరువాత ఒక్కసారిగా ఆగిపోయిన శుభకార్యక్రమాలు తిరిగి శ్రావణం రాకతో ఊపందుకుంటాయి. ఈనెల 25 నుంచి శ్రావణమాసం ప్రారంభమవుండగా ఆగస్టు 17 వరకు వివాహం, గృహప్రవేశం వంటి శుభముహూర్తాలను పండితులు, పంచాగకర్తలు నిర్ణయించారు. శ్రావణమాసానికి సంబంధించి జూలై 30,31, ఆగస్టు 3,5,7,8,9,10,11,12,13,14,17 తేదీల్లో వివాహాది శుభ ముహూర్తాలను నిర్ణయించారు. వీటిలో జూలై 31, ఆగస్టు 8,9,10,13,14 తేదీల్లో అత్యంత బలమైన ముహూర్తాలుగా పండితులు తెలిపారు. శ్రావణ మాసం శుభముహూర్తాలతో కార్యక్రమాలు నిర్వహించే పురోహితులు, సన్నాయిమేళం, కల్యాణ మండపాలకు గిరాకీ ఏర్పడింది. క్యాటరింగ్, ఫొటోగ్రాఫర్‌లు, వీడియోగ్రాపర్లకు డిమాండ్ నెలకొంది. శ్రావణమాసంలో ఒక్క అన్నవరం దేవస్థానంలో సుమారు 600 వివాహాలు జరగవచ్చని అంచనా. ఆగస్టు 17 దాటితే భాద్రపదమాసం శూన్య మాసం కావడంతో నెలరోజులు శుభకార్యాలకు అవకాశం లేదు. మళ్లీ సెప్టెంబ రు 24 నుంచి నవంబరు 30 వరకు ముహూర్తాలున్నాయి.

శ్రావణం..శుభమస్తు 6

ఉప్పాడ తీర ప్రాంత కోత నివారణకు చర్యలు

ఈనెల 30న న్యూఢిల్లీ పయనమవుతున్న కలెక్టర్

హోంశాఖ కార్యదర్శి వద్ద ప్రజెంటేషన్



కలెక్టరేట్ (కాకినాడ), జూలై22 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ తీర ప్రాంత కోత నివారణకు శాశ్వత పరిష్కారం లభించనుంది. తీర ప్రాంత కోత వల్ల జరిగే నష్టాన్ని వివరించడానికి కలెక్టర్ షాన్‌మోహన్ ఈనెల 30న న్యూఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శితో ఆయన ప్రత్యేకంగా భేటీ అవుతారు. ఉప్పాడ తీర ప్రాంత కోత నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారు. రూ.323 కోట్లు విడుదల చేయాలని, శాశ్వత ప్రాతిపదికన తీరంలో రక్షణ గోడ నిర్మిస్తామని ప్రజెంటేషన్ ఇస్తారు.

కాకినాడలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి

స్వాగతం పలికిన ఎమ్మెల్యే వనమాడి, ఇతర నాయకులు

నేడు 'తొలి అడుగు' కార్యక్రమానికి హాజరు

కాకినాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం రాత్రి కాకినాడ విచ్చేశారు. జీఆర్‌టీ గ్రాండ్ హోటల్‌లో బస చేసిన ఆయనను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, టీడీపీ ముఖ్య నేతలు మర్యాదపూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. 39వ డివిజన్ పరిధిలోని వినాయకుని ఆలయం, చీడీలపొర, ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఎదుట వీధి, రామారావుపేటల్లో బుధవారం ఉదయం జరిగే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు.

కాకినాడలో రవాణా శాఖ మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వనమాడి, టీడీపీ నాయకులు



అనంతపాపం.. బద్ధలు!

మళ్లీ వీధికెక్కిన హత్యకేసు



వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కార్ సీట్‌లో డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం మృతదేహం (ఫైల్)

- డ్రైవర్ హత్య కేసులో కీలక మలుపు
- తదుపరి విచారణకు అనుమతి
- ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం తీర్పు
- జగన్ ప్రభుత్వం అనంత ప్రేమ
- పైపై ఆధారాలతో ఛార్జిషీట్
- న్యాయవాది ముప్పాళ్ల పోరాటం
- న్యాయం చేస్తామని లోకేశ్ హామీ
- ఎట్టకేలకు రంగంలోకి పోలీస్
- బెయిల్‌పై ఉన్న అనంతబాబు

(కాకినాడ/రాజమహేంద్రవరం, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఇన్నేళ్లపాటు పూర్తిగా పక్కన పడిపోయిన కేసును తదుపరి మరింత లోతుగా విచారణ జరిగేలా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ న్యాయ స్థానం మంగళవారం తీర్పునిచ్చింది. పోలీసులు దాఖలు చేసిన తొలి చార్జిషీటులో అనేక కీలక వాస్తవాలు విస్మరించిన నేపథ్యంలో బాధితుల విజ్ఞప్తి, ప్రాసిక్యూషన్ వాదనను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం కేసుపై 90 రోజుల్లోగా సప్లమెంటరీ ఛార్జిషీటు దాఖలు చేయాలని ఆదేశించింది. తాజా కోర్టు ఆదేశాలతో కేసు మరింత దర్యాప్తునకు మార్గం సుగమమైంది.

కారులో తీసుకెళ్లి.. డెడ్ బాడీ తెచ్చి..

ప్రశాంత నగరంగా పేరొందిన కాకినాడ 2022 మేలో అట్టుడికిపోయింది. సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన ఎమ్మెల్సీ అనంతబాబు 2022 మే 18న రాత్రి తన వద్ద పనిచేసే దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం ఇంటికి వచ్చి పని ఉందని తీసుకువెళ్లి హత్య చేశాడు. మే 19 తెల్లవారు జామున మృతదేహాన్ని స్వయంగా తన కారులో అనంతబాబు డ్రైవర్ ఇంటికే తీసుకొచ్చాడు. పలు పరిణామాల నేపథ్యంలో అనంతబాబును అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. గత వైసీపీ ప్రభుత్వం తన సొంత పార్టీ ఎమ్మెల్సీ అనంతబాబుపై అవాజ్యమైన ప్రేమ కురిపించింది. అనంతబాబును కాపాడేందుకు కేసును నీరుగార్చేసింది. పైపై ఆధారాలతో న్యాయ స్థానంలో చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో అనంతబాబు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో కొద్దిరోజులు శిక్ష అనుభవించి ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు.

ఇక అన్నీ తేల్చేస్తారు..

ఈ కేసుపై రాజమహేంద్రవరంలో సీనియర్ న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు 2018లో తీవ్ర పోరాటం చేశారు. బెయిల్ రద్దు, విచారణ లోతుగా జరిగేలా కృషి చేశారు. అనంతబాబుపై గతంలో రౌడీషీట్ లేదని పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొనడంపైనా పిటిషన్ దాఖలు చేశారు. రౌడీషీట్ ఉందని నిరూపించారు. న్యాయం కోసం బాధితులను వెంటబెట్టుకుని హైకోర్టు వరకు వెళ్లారు. అయితే వైసీపీ ప్రభుత్వ పెద్దల సహకారంతో కేసు నీరుగారిపోయింది. గతేడాది ప్రభుత్వం మారాక కేసు విచారణ మలుపు తిరిగింది. ఎన్నికల సమయంలో బాధితులు నారా లోకేశ్‌ను యు.కొత్తపల్లి సభలో కలిసి తమకు న్యాయం చేయాలని కోరగా అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగా ప్రభుత్వం మారాక ఈ ఏడాది మార్చి నుంచి కేసులో వేగం పెరిగింది. ఈ కేసుపై తొలి నుంచీ పోరాటం చేస్తోన్న ముప్పాళ్లను ప్రాసిక్యూషన్‌కు సహకరించేందుకు వీలుగా ఏప్రిల్ 17న ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ తర్వాత కొన్ని రోజులకు కేసు తదుపరి విచారణకు అనుమతివ్వాలని కోరుతూ ప్రాసిక్యూషన్ రాజమహేంద్రవరం అట్రాసిటీ న్యాయ స్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. హత్య అనంతరం జరిగిన దర్యాప్తులో అనేక కీలక అంశాలను విస్మరించిన నేపథ్యంలో లోతుగా కేసును విచారించాల్సిన అవసరం ఉందని పిటిషన్‌లో పేర్కొంది.తదుపరి విచారణకు అనుమతి మంజూరు చేయాలని కోరింది. మరోపక్క మృతుడి తల్లి నూకరత్నం సైతం తన కుమారుడి హత్య కేసులో తనకు అనుమానాలున్న విషయంపై ఇప్పటికే డీజీపీకి ఫిర్యాదు చేసిన అంశాన్ని పిటిషన్‌లో ప్రాసిక్యూషన్ ప్రస్తావించింది. ఈ కేసును తదుపరి విచారించేందుకు వీలుగా పాటిల్ దేవరాజ్ మనిష్ అనే ఐపీఎస్ అధికారిని కాకినాడ జిల్లా ఎస్పీ నియమించిన విషయాన్ని పిటిషన్‌లో ప్రాసిక్యూషన్ ప్రస్తావించింది. హత్య కేసులో మరికొందరు సాక్షులను విచారించాల్సి ఉండడం, మరిన్ని సాంకేతిక ఆధారాలు సేకరించాల్సి ఉన్న నేపథ్యంలో తదుపరి విచారణకు అనుమతి కోరింది. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలోని అట్రాసిటీ న్యాయస్థానం కేసు తదుపరి విచారణకు అనుమతివ్వడంతో మరింత లోతుగావిచారణ జరగనుంది.

తల్లి ఫిర్యాదు.. సిట్ టీమ్

తన కుమారుడి హత్య కేసులో తనకు అనుమానాలున్నాయని ఇప్పటికే డీజీపీకి మృతుడి తల్లి నూకరత్నం ఫిర్యాదు చేశారు. దీంతో డీజీపీ కార్యాలయం నుంచి కాకినాడ ఎస్పీ బిందుమాధవ్‌కి వెంటనే యాక్షన్ తీసుకోవాలని ఆదేశాలు అందాయి. విచారణకు డీఎస్పీ స్థాయి అధికారులను నియమించడంతోపాటు 60 రోజుల్లో నివేదిక ఇచ్చి తదుపరి యాక్షన్‌కు కోర్టును అనుమతి కోరాలని ఆదేశించారు. ఈ ఏడాది కేసు విచారణకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను నియమిస్తూ కాకినాడ ఏఎస్పీ పి.దేవరాజ్ మనీష్ మెమో జారీచేశారు. ఆ టీమ్‌లో సీసీఎస్ సీఐ వి.కృష్ణ, ఎస్‌ఐలు బి.వినయ్‌ప్రతాప్, పి.శ్రీనివాస్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ కె.రామకృష్ణ, కానిస్టేబుల్ ఎం.సతీష్ ఉన్నారు.

కేసుపై మళ్లీ విచారణ

లోతైన విచారణ చేయడంతోపాటు 90 రోజుల్లో అనుబంధ చార్జిషీట్ దాఖలు చేయాలని కోర్టులో దాఖలైన పిటిషన్‌పై రాజమహేంద్రవరం ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కార న్యాయస్థానం న్యాయమూర్తి సింగవరపు ఉమా సునంద మంగళవారం తీర్పు ఇచ్చారు. దీంతో అనంతబాబు వ్యవహారం మళ్లీ చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో అనంతబాబుపై తిరిగి పూర్తి విచారణ జరగనుంది. న్యాయసలహాదారుగా న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు.. పీపీలు కె.రాధా కృష్ణ, డి.శ్రీవాణి వాదించారు.

ఎవరూ తప్పించుకోలేరు..



దళిత డ్రైవర్‌ను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన కేసులో ఎవరూ తప్పించుకోలేరు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుతో పాటు అతనికి సహకరించిన వారికి శిక్ష పడుతుంది. ఇప్పటికే ప్రభుత్వం సిట్‌ను నియమించింది.. సిట్ అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి 90 రోజుల్లో అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసి కోర్టుకు సమర్పించాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం అనంతబాబును కాపాడడానికి శక్తివంచన లేకుండా పనిచేసింది. కానీ ప్రజా పోరాటాల వల్ల కేసు మళ్లీ తెరమీదకు వచ్చింది. ఆనాటి కాకినాడ ఎస్పీ, ఇతర అధికారులు అనేక తప్పిదాలు చేశారు.ఈ కేసులో ఎవరెవరు ఏ పాత్ర పోషించారో తేల్చే అవకాశాలు ఉన్నాయి.

- ముప్పాళ్ల సుబ్బారావు, న్యాయవాది

పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌ను పటిష్టంగా అమలుచేయాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్



సమీక్ష చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్

జీజీహెచ్ (కాకినాడ), జూలై 22 (ఆంధ్రజ్యోతి) కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశానుసారం పీసీఅండ్‌పీఎన్‌డీటీ యాక్ట్‌ను పటిష్టంగా అమలు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఆదేశించారు. మంగళవారం ఆయన తన చాంబర్లో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటక్షన్ యూనిట్ (డీపీసీయూ), చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ), పీసీఅండ్‌పీఎన్‌డీటీ యాక్ట్‌కు సంబంధించిన అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అప్రాప్రియేట్ అథారిటీలో తప్పనిసరిగా నమోదై సంబంధిత ఆసుపత్రులు చట్టంలోని సూచనలను కచ్చితంగా పాటించాలని, లేనిపక్షంలో జరిమానా, జైలుశిక్ష విధిస్తామన్నారు. పీసీ అండ్‌పీఎన్‌డీటీ చట్టం-1994 ప్రకారం స్కానింగ్, ఇతర గర్భస్థ శిశు పరీక్షల ద్వారా లింగ నిర్ధారణ చేయడం, వివరాలను వెల్లడించడం చట్టరీత్యా నేరమన్నారు. చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ పరీక్ష చేసిన వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి 3 నుంచి 5 సంవత్సరాల వరకు జైలుశిక్ష, రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారన్నారు. జిల్లాలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఏదైనా స్కాన్ సెంటర్, హాస్పటల్‌లో పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని తెలియజేస్తే వారిపై నిఘా పెట్టడంలో భాగంగా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని, వాటి ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. 18 సంవత్సరాలు నిండని వివాహాలపై సమష్టి దృష్టి సారించడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై తీర్మానం చేసుకోవడం ద్వారా లక్ష్యాలను అధిగమించవచ్చున్నారు. స్కానింగ్ సెంటర్లలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా వాట్సప్ నెంబరు 94941 13365, టోల్‌ఫ్రీ నెంబరు 18004253365లకు తెలియజేయాలన్నారు. సమావేశంలో డీసీపీవో వీహెచ్ వెంకట్రావు, సీడబ్ల్యూసీ సభ్యురాలు జె.సంతోషకుమారి, పెద్దాపురం డివిజన్ సూపర్‌వైజింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఆర్మీ ర్యాలీ నిర్వహించాలి

కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, హాకీ టోర్నమెంట్ నిర్వహణకు ప్రణాళిక ప్రకారం పనిచేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు.కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రధానంగా బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ, టాయిలెట్స్, లైటింగ్, పీఏ సిస్టం, ట్రాన్స్‌పోర్ట్, భోజన వసతి, తాగునీరు, పారిశుధ్యం వంటి అంశాలపై సమీక్షించారు. ఆగస్టు 1 నుంచి 12 వరకు జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపి యన్‌షిప్, ఆగస్టు 3 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ కాకినాడ జిల్లా క్రీడా మైదానం వేదికగా నిర్వహిస్తామన్నారు. సామాన్య ప్రజలు ఇబ్బందిపడకుండా ట్రాఫి క్ నియంత్రణ చేపట్టాలన్నారు. హాకీ టోర్న మెంట్‌కు సంబంధించిన 30 బృందాలకు ఏయే రాష్ట్రాలకు ఏ ప్రదేశాల్లో వసతి కల్పి స్తున్నామో అక్కడ ఏర్పాట్లకు సంబంధించి అధికారులు స్పష్టమైన అవగాహనతో పని చేయాలన్నారు. రెండు కార్యక్రమాలకు వేర్వే రుగా వైద్య బృందాలు ఏర్పాటు చేయాల న్నారు. తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, సీపీవో త్రినాథ్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాస కుమార్, డీఎఫ్‌వో రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి రూ.11.30 లక్షల విరాళాలు

వచ్చే నెలలో కాకినాడలో జరగనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, హాకీ టోర్నమెంట్ నిర్వహణకు మంగళవారం వివిధ ప్రైవేటు సంస్థల నుంచి రూ.11.30 లక్షల విరాళాలు వచ్చాయని కలెక్టర్ షాన్ మోహన్‌కు తెలిపారు. కాకినాడ ఎస్ఆర్ఎంటీ రూ.5 లక్షలు, దేవీ ఫిష్ రూ.లక్ష, శ్రీచైతన్య స్కూలు రూ.50 వేలు, శ్రీచైతన్య జూనియర్ కళాశాల రూ.50 వేలు, భాష్యం స్కూలు రూ.50 వేలు,కైట్ కళాశాల రూ.లక్ష, కాకినాడ రిటైల్ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ రూ.30 వేలు, ఏఎల్ఎస్ఎంఐ ఎక్స్‌పోర్ట్స్ రూ.50 వేలు, అనపర్తి రీజియన్ పౌల్ట్రీ ఫార్మర్స్ వెల్ఫేర్ సొసైటీ రూ.లక్ష, బీఎస్ సీతాపతి రావు రూ.లక్ష అందజేశారు. స్పాన్సర్లకు కలెక్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



ఏలేరులో తగ్గిన నీటిమట్టం

తీవ్ర వర్షాభావమే కారణం 7



సూక్ష్మ పోషకాలతో అన్నీ లాభాలే! 6

ఈఎస్ఐ హా..సుపత్రి!



కాకినాడ సాంబమూర్తి నగర్‌లో రూ.116 కోట్లతో నిర్మించిన ఈఎస్ఐ ఆసుపత్రి భవనం

- రూ.116 కోట్లతో నిర్మాణం
- రోజుకు 500 ఓపీ
- కిటకిటలాడుతున్న ఆసుపత్రి
- అరకొరగా వైద్య సేవలు
- కార్మికులకు తప్పని ఇక్కట్లు
- కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహణ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కార్మికుల ఆరోగ్య భద్రత కోసం రూ.116 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో కాకినాడలో నిర్మించిన వంద పడకల ఈఎస్ఐ (కార్మిక రాజ్య బీమా సంస్థ) ఆసుపత్రిలో సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. 2024 ఫిబ్రవరి 25న ఆసుపత్రి ప్రారంభమైనా వైద్య సేవలు మాత్రం అరకొరగానే ఉన్నాయి. సుమారు 80 వేల మంది కార్మికులు ఈ ఆసుపత్రిలో వివిధ రకాల వైద్య సేవలు పొందుతున్నారు. సువిశాలమైన ప్రాంగణంలో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఆసుపత్రి నిర్మించారు. ఔట్ పేషెంట్లకు అవసరమైన వైద్య పరీక్షలతో పాటు,ఇన్ పేషెంట్లకు ప్రత్యేకమైన గదులున్నాయి. 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం జనరల్ మెడిసిన్, ఆర్థో, 24 గంటల ఎమర్జెన్సీ, యూరాలజీ, గైనకాలజీ, చిల్డ్రన్, ఫిజియోథెరపీ, ఆప్తమాలజీ, డెంటల్ విభాగాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆపరేషన్ థియేటర్స్ అందుబాటులో ఉన్నాయి.రోజుకు కనీసం 500 మంది ఓపీ చూస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ఆసుపత్రి కార్మికులతో కిటకిటలాడుతోంది.

అందని వైద్య సేవలు..

కీలకమైన గుండె వ్యాధులు, పల్మనాలజీ విభాగ వైద్య సేవలు మాత్రం ఇక్కడ అందట్లేదు. వీటి కోసం స్థానికంగా ఉన్న కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్ యంత్రాలు ఏర్పాటు కాలేదు. ఇది వంద పడకల ఆసుపత్రి అని చెప్తున్నా.. ప్రస్తుతం మాత్రం 50 పడకల ఆసుపత్రిగా కొనసాగుతోంది. ప్రస్తుతం 38 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. పరిపాలనా విభాగంలో 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

నిత్యం శుభ్రంగా..

సాధారణ జీజీహెచ్ ఆసుపత్రికి, ఈఎస్ఐ ఆసుపత్రికి నిర్వహణలో మాత్రం తీవ్ర వ్యత్యాసం కనిపిస్తోంది. ముఖ్యంగా ఆసుపత్రి ఆవరణతో పాటు ఇన్ పేషెంట్ల రూమ్‌లను పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచుతున్నారు. ఇందుకు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించారు. ఆసుపత్రిలో 24 గంటలూ భద్రతా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. సుమారు 30 మంది వరకు వివిధ షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలో నడుస్తున్న ఈ ఆసుపత్రికి అన్నీ ఆదేశాలు ఢిల్లీ నుంచే అమలు చేస్తున్నారు.

2.25 లక్షల మందికి వైద్య సేవలు

కాకినాడ సాంబమూర్తినగర్‌లో నిర్మించిన ఈఎస్ఐ ప్రధాన కార్యాలయానికి అనుసంధానంగా జిల్లాలోని పలు డిస్పెన్సరీలు కార్మికులకు వైద్య సేవలందిస్తున్నాయి. కాకినాడ రూరల్ మండలంలోని వలసపాకల, సామర్లకోట, పిఠాపురం, పెద్దాపురం, తుని, ద్రాక్షారామ, యానాం... ఇలా పలు చోట్ల డిస్పెన్సరీలు ఉన్నాయి. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు కలిపి సుమారు 2.25 లక్షల మంది ఇక్కడ వైద్య సేవలు పొందుతున్నారు. రూ.21వేలలోపు జీతం ఉన్న కార్మికు లంతా ఈఎస్ఐ పరిధిలోకి వస్తారు. వారందరికీ ఆసుపత్రిలో వైద్య సేవలు అందుతాయి.



'ఫీజు బకాయిలు విడుదల చేయాలి'

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణం విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ధూ మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు చదువు నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రూ.6,400 కోట్లు బకాయిలు పేరుకుపోయాయని, వీటిని వెంటనే విడుదల చేయాలన్నారు. కాకినాడ బాలాజీచెరువు సెంటర్‌లోని ఎస్సీ బాలురవసతి గృహాన్ని నిర్మించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ ఇవ్వాలన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేలు భృతి ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఉమ్మడి జిల్లా నాయకులు నవీన్, సాయికిరణ్, మూర్తి, మనోహర్, బాలమణి, కంఠ, ప్రసాద్, భద్రం, శ్రీనివాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణం.. శుభమస్తు!



(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

కల్యాణ శోభను సంతరించుకుని మరో రెండు రోజుల్లో మార్కెట్ శ్రావణ శోభతో కళకళలాడనుంది. ఆషాఢమాసం నిరాశను మిగల్చగా శ్రావణ మాసంకోసం మార్కెట్‌లో అన్నివర్గాల ప్రధాన వ్యాపారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. శ్రావణమాసం నుంచి వివాహాది శుభ ముహూర్తాలు మెండు ఉండడంతోపాటు వరుసగా పండుగలు, నోములు, వ్రతాలు ఉన్నాయి. కొత్తగా పెళ్లి అయిన దంపతులు ఆషాఢమాసం కారణంగా నెల రోజుల పాటు దూరంగా ఉన్నారు. వారంతా శ్రావణమాసం కోసం ఎదురుచూస్తున్నారు. పుట్టింట ఉన్న భార్యను మెట్టినింటికి తీసుకువెళ్లేందుకు వారి వ్యక్తిగత నామ నక్షత్రాలను బట్టి సిద్ధాంతులు ముహూర్తాలను నిర్ణయిస్తున్నారు. కొందరికి ముందుగా ముహూర్తం కుదిరితే మరికొందరికి ఇంకొంత ఆలస్యమవుతుంది. గత రెండు నెలలుగా పెళ్లిళ్లు లేవు. పండుగలు, ఇతర శుభ కార్యక్రమాలు అంతంత మాత్రమే. వస్త్ర వ్యాపారం, బంగారం కొనుగోళ్లు ఇలా ఎన్నో వ్యాపారాలు డీలా పడిపోయాయి. ఆషాఢమాసం అలా ముగుస్తుందో లేదో ఒక్కసారిగా మార్కెట్‌లో కొత్త శోభ సంతరించుకుంటుంది. ఆషాఢం వెళ్తావెళ్తా శ్రావణ శోభను తీసుకువస్తుంది. శ్రావణమాసపు అమ్మకాలు ఏ స్థాయిలో ఉంటాయో అంచనాలు వేసుకుని ఇప్పటికే కొనుగోళ్లు జరిపి వస్త్ర వ్యాపారులతో అన్ని వ్యాపార సంస్థలు నిండుకుండలా తొణికిసలాడుతున్నాయి. శ్రావణం అంటేనే పండుగలు. దానికితోడు వివాహాది శుభకార్యాలు మెండుగా ఉండడంతో మార్కెట్ ఊపందుకోనుంది.

- ప్రారంభం కానున్న శ్రావణ శోభ
- 25నశుక్రవారం శ్రావణ మాసం ప్రారంభం
- మెండుగా వివాహాది ముహూర్తాలు.. నిండుగా పండుగలు

శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రం 'శ్రవణ'

అమావాస్యతో ఆషాఢమాసం ముగిసి శుక్రవారం నుంచి శ్రావణ సందడి మొదలవుతోంది. ఈనెల 25 నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు శ్రావణమాసం. ఈ శ్రావణమంతా నోములు, వ్రతాలు, పండుగలతో ప్రతీ ఇంటా సందడే. శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణ. ఆ పేరు మీద వచ్చిన శ్రావణమాసం కావడంతో శ్రీలక్ష్మీదేవికి ఎంతో ఇష్టం. శ్రావణ సోమవారం వ్రతాన్ని పరమశివుని ప్రీత్యర్థం జరుపుకుని భక్తులు ఉపవాసాలుంటారు. ఇక ప్రతీ మంగళవారం కొత్తగా వివాహమైన స్త్రీలు మంగళగౌరీ వ్రతాలు జరుపుకుంటారు. తిధి, నక్షత్రాలను బట్టి సూపౌదన వ్రతం, అవ్యంగ సప్తమీ వ్రతం, పుష్పాష్టమి వ్రతం, అనంగ వ్రతం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఇక ఆగస్టు 8న ప్రతి ఇంటా వరలక్ష్మీ వ్రతాలు జరుపుకుంటారు. ఆరోజున వీలుపడని వారు జూలై 25, ఆగస్టు 1, 15, 22 తేదీల్లోను వరలక్ష్మీవ్రతాలు చేసుకుంటారు. ఈ ఏడాది ఐదు శ్రావణ శుక్రవారాలు రావడం విశేషం. ఈ నెల 27న స్వర్ణగౌరీ వ్రతం, 28న నాగచతుర్థి, 29న మంగళగౌరీ వ్రతం, నాగపంచమి, గరుడపంచమి జరుపుకుంటారు. 30న సూర్యషష్ఠి, ఆగస్టున 7న వరాహ జయంతి, 8న వరలక్ష్మీ వ్రతం, 9న వచ్చే పౌర్ణమి.. రాఖీ పౌర్ణమి. ఇక జంధ్యాల పౌర్ణమి కూడా కావడంతో జీర్ణమయ యజ్ఞోపవీతాలను విసర్జించి కొత్తవాటిని ధరిస్తారు. 15న వచ్చే శ్రీకృష్ణ జన్మాష్టమిని అయితే పాఠశాల విద్యార్థులు వారం రోజుల ముందు నుంచే జరుపుకుంటారు. 16న వైష్ణవ శ్రీకృష్ణ జయంతి, 22న పోలాంబ వ్రతం జరుపుకుంటారు. **- కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి, బండారులంక**

పండుగలే పండుగలు.. జూలై 29న నాగపంచమి.. ఆగస్టు 8న వరలక్ష్మీవత్రం



అంబాజీపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): శ్రావణం రాకతో ఊరువాడా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. అమ్మవారి ఆలయాలన్నీ కొత్తశోభను సంతరించుకుంటున్నాయి. మనసుకు ప్రశాంతత కల్పించే ఈ మాసంలో మహిళలు సకల సౌభాగ్యాలతోపాటు శ్రీమహాలక్ష్మి అమ్మవారి కటాక్షం పొందేందుకు వ్రతాలు, ఉపవాసాలు, ఆరాధనలు ప్రారంభించనున్నారు. మహిళలంతా భక్తిప్రపత్తులతో కుంకుమ పూజలు ఆచరిస్తున్నారు. పున్నమి చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ మాసంలో ఒక్కొక్క రోజుకు ఒక్కొక్క విశిష్టత ఉందని పండితులు పేర్కొన్నారు. ఈ మాసంలో వచ్చే అన్ని శుక్రవారల్లోనూ శ్రావణలక్ష్మి పూజలు చేస్తారు. ఈ ఏడాది శ్రావణమాసం జూలై 25 నుంచి ప్రారంభమం కానుంది. వివాహితులు ఈనెలలో నోములు, వ్రతాలతో గడుపుతారు. వరలక్ష్మి వ్రతం రోజున అమ్మవార్కి కలశం పెట్టి నిండుగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. ఇలా చేస్తే ఆయురోగ్యాలతోపాటు సౌభాగ్యం లభిస్తుందని విశ్వాసం. ఈనెలలో ప్రధానంగా 29వ తేదీన నాగుల పంచమి, ఆగస్టు 8న వరలక్ష్మీవ్రతం, 9న రాఖీ పౌర్ణమి, 12న సంకష్ట హర చతుర్థి, 16న శ్రీకృష్ణాష్టమి, 19న అజ ఏకాదశి, ఆగస్టు 23న పోలాల అమావాస్య, శ్రావణమాసం ముగింపు, ఆగస్టు 27న వినాయక చవితి పండుగలు జరగనున్నాయి. తమ భర్తలు, కుమారులు పంటపొలాల్లో సంచరించే సమయంలో ఎలాంటి హానీ తలపెట్టోందని నాగేంద్రుడుని మహిళలు పూజించే పండుగే నాగుల పంచమి. సోదర క్షేమాన్ని తమకు రక్షణ భాగ్యాన్ని కల్పించమని కోరుతూ నిర్వహించేదే రాఖీ పౌర్ణమి వేడుక. అలాగే యజ్ఞోపవీతాన్ని ధరించేందుకు జంధ్యాల పౌర్ణమి, గ్రామదేవతలను కొలిచేందుకు చేసుకునే పోలాల అమావాస్య పండుగ తదితర పర్వదినాలు ఈ మాసంలో వస్తాయి. అలాగే శ్రావణ మాసంలో వచ్చే నాలుగు మంగళవారాలకు మహిళలు మంగళగౌరిని పూజిస్తారు. పార్వతిదేవికి మరో పేరే మంగళగౌరి. కొత్తగా వివాహమైన వధువులు ఈ వ్రతం ఆచరిస్తే సౌభాగ్యం. ఐదోతనం కలకాలం సిద్ధిస్తుందని విశ్వాసం. మరో ముఖ్యమైన శ్రీ వరలక్ష్మీ వత్రం ఆచరిస్తే అష్టలక్ష్మిలను కొలిచినట్టే. పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం ఈ వ్రతం ఆచరించడానికి మహిళలు ఎదురు చూస్తున్నారు. ఇక శ్రావణ మాసం సందర్భంగా పలు అమ్మవారి ఆలయాలతోపాటు ప్రముఖ ఆలయాలు ముస్తాబుకానున్నాయి. అనునిత్యం వ్రతాలు, హోమాలు నిర్వహిస్తారు.

అపురూపం అనుగ్రహం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలో శాకంబరిగా దర్శనమిచ్చిన అన్నపూర్ణాదేవి

ఆషాఢ మాసంలో గ్రామ దేవతలను కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలుచోట్ల అమ్మవార్లను మంగళవారం వివిధ రూపాల్లో శోభాయమానంగా తీర్చిదిద్దారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని అమ్మవార్ల అనుగ్రహం పొందారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మతల్లిని పసుపుకొమ్ములు, నెమలి పింఛాలతో అలంకరించిన దృశ్యం

ఐటీఐల్లో ప్రవేశానికి నేడు, రేపు రెండో విడత కౌన్సెలింగ్

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో 2025-26 సంవత్సరానికి గాను రెండో విడత ప్రవేశానికి 1035 అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్నారు. వారికి మెరిట్ లిస్టు ప్రకారం కౌన్సెలింగ్ ప్రక్రియ కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 23, 24 తేదీల్లో జరుగుతుందని ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాల్‌వర్మ తెలిపారు. 23వ తేదీ ఉదయం 8 గంటలకు 9.7 నుంచి 6.2 జీపీఏ గ్రేడ్ వరకు, మధ్యాహ్నం ఒంటి గంటకు 6.1 నుంచి 5.2 జీపీఏ గ్రేడ్ వరకు, 24వ తేదీ ఉదయం 8 గంటలకు 5.1 నుంచి 4.3 జీపీఏ గ్రేడ్ వరకు, మధ్యాహ్నం ఒంటి గంటకు 4.2 నుంచి 2.0 జీపీఏ గ్రేడ్ వరకు కౌన్సెలింగ్ జరుగుతుంది. అభ్యర్థులంతా ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

కాలుష్యకారక పరిశ్రమల అనుమతులు రద్దు చేయాలి

ఉమ్మడి జిల్లా మహాసభలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్‌పర్సన్ విమలక్క పిఠాపురంలో కార్మికుల భారీ ప్రదర్శన



పిఠాపురంలో జరిగిన ఏఐటీయూసీ మహాసభలో మాట్లాడుతున్న విమలక్క

పిఠాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంతంలో మత్స్యకారుల పొట్టగొడుతున్న కాలుష్యకారక పరిశ్రమల అనుమతులను రద్దు చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉభయ తెలుగు రాష్ట్రాల చైర్‌పర్సన్ విమలక్క డిమాండ్ చేశారు. అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మహాసభ కాకినాడ జిల్లాలోని పిఠాపురంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలో మంగళవారం జరిగింది. తీర ప్రాంతంలో ఉన్న ఫార్మా పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యకారక వ్యర్థాలను సముద్రంలోకి వదిలివేస్తుండటంతో మత్స్యసంపద చనిపోతోందన్నారు. హేచరీలు దెబ్బతింటున్నాయని, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన వక్త, ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ గృహాలకు స్మార్ట్‌మీటర్లను బలవంతంగా బిగిస్తున్నారని, దీనివల్ల ప్రజలపై అదనపు భారం పడుతోందన్నారు. కార్మిక చట్టాల అమలుకు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు పిఠాపురం వీధుల్లో కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉపాధి కూలీల వేతనాన్ని రూ.600కి పెంచాలని, రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు అధ్యక్షతన జరిగిన సభలో సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గొల్ల అంజియ్య, అరుణోదయ సమాఖ్య ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు ఏపూరి సుధాకర్, మల్సూర్ ఖదీర్, ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వల్లూరి రాజబాబు, బి.రమేష్, డొక్కులూరి సంగీత, కె.బోజీ, డి.నారాయణమూర్తి, మడికి సత్యం, గుడాల చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు డీసీసీబీ చైర్మన్ పూజలు



పెద్దాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) సతీసమేతంగా మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. మరిడమ్మ దేవస్థానంలో నిత్యాన్నదానానికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. మరిడమ్మ దర్శనానికి వచ్చిన భక్తులకు మంగళవారం ఆయన డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)తో కలిసి అన్న ప్రసాదం వడ్డించారు. సుమారు రెండు వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. టీడీపీ నేత రాజా సూరిబాబురాజు, జనసేన నాయకుడు పొలమరశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

సోలార్ శక్తి, మారిటైం నైపుణ్య రంగాల్లో రాష్ట్రానికి ప్రాధాన్యం

ఎంపీ సతీష్‌బాబు ప్రశ్నలకు కేంద్ర మంత్రుల సమాధానం

కాకినాడ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సోలార్ శక్తి, మారిటైం నైపుణ్య రంగాల్లో రాష్ట్రానికి ప్రాధాన్యత ఇస్తామని కేంద్ర న్యూ అండ్ రెన్యువల్ ఎనర్జీ, శాఖ మంత్రి శ్రీపాద యశో నాయక్, కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ పేర్కొన్నారు. రాజ్యసభలో టీడీపీ ఎంపీ సానా సతీష్‌బాబు అడిగిన రెండు ప్రశ్నలకు వారు సమాధానాలు ఇచ్చారు. సోలార్ విద్యుత్ రంగంలో ఆంధ్రప్రదేశ్ స్థిరమైన పురోగతి సాధ్యమవుతుందని వివరించారు. మొత్తం 1,454.86 మెగా వాట్ల గ్రౌండ్ మౌంటెడ్ సామర్థ్యం రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. కేంద్ర పథకాల ద్వారా 3,300 మెగావాట్లతో పార్కుల అభివృద్ధి, 38వేల కుటుంబాలకు రూఫ్‌టాప్ సోలార్ ద్వారా విద్యుత్, లక్ష వ్యవసాయ పంపులు పీఎం కిసాన్ కింద కేటాయింపు, 400 మెగావాట్ల ఈపీసీ ఒప్పందాలు జరిగాయని తెలిపారు. మారిటైం నైపుణ్యాభివృద్ధి-విశాఖ సీఈఎంఎస్ కేంద్రం దేశంలోనే అత్యుత్తమంగా ఉందన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం, షిప్ బిల్డింగ్ కేంద్రాలు దేశంలో రెండు ఉన్నాయని... వీటిలో విశాఖలో 22, ముంబయిలో 6 ల్యాబ్స్ ఉన్నాయని వెల్లడించారు. కాకినాడ వంటి తీర ప్రాంతాల్లో కూడా ఇలాంటి ప్రాజెక్టులకు కేంద్రం ప్రాధాన్యమిచ్చేలా ఎంఎస్‌ఆర్‌ఈ, ఎస్‌ఈసీఐ సంస్థలతో చర్యలు కొనసాగిస్తానని ఎంపీ చెప్పారు.



రాజ్యసభలో మాట్లాడుతున్న ఎంపీ సతీష్‌బాబు




సూక్ష్మపోషకాలు వేసిన పొలంలో వరి పంట.. సూక్ష్మపోషకాలు అవసరత ఉన్న చౌడు బారిన పొలం

సూక్ష్మ పోషకాలతో అన్నీ లాభాలే!

- పంట ఎదుగుదలలో కీలక పాత్ర
- చౌడు నివారణకు దోహదం
- దిగుబడులు పెరిగే అవకాశం
- నూరు శాతం సబ్సిడీపై అందిస్తే రైతుకు దన్ను
- గతంలో ఇదే విధంగా పంపిణీ చేసిన టీడీపీ ప్రభుత్వం

భూసార పరిరక్షణ, పంటలు పుష్కలంగా పండాలంటే సూక్ష్మపోషకాలు సమృద్ధిగా ఉండాలి. ఇవి సమతుల్యంగా లేకుండా ఉంటే భూమి చౌడు బారుతుంది. దిగుబడులు తగ్గిపోతాయి. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా సూక్ష్మపోషకాలను వినియోగిస్తే రైతులకు అన్నీ లాభాలే. వీటిని నూరుశాతం సబ్సిడీపై అందిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇదే రీతిలో ఇచ్చిన విషయాన్ని రైతులు గుర్తుచేసుకుంటున్నారు.



2019 వరకు టీడీపీ ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీపై అందించిన జింక్ సల్ఫేట్

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

పంట ఆరోగ్యంగా ఎదిగి సమృద్ధిగా పండడానికి, దిగుబడులు ఆశాజనంగా లభించడంలో సూక్ష్మ పోషకాలు కీలక పాత్ర పోషిస్తాయి. సూక్ష్మ పోషకాలు(మైక్రోన్యూట్రియంట్స్) అయిన జింక్, ఐరన్, మాంగనీస్, రాగి, బోరాన్, గంధకం వంటివి సమతుల్యంగా ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. పంట భూముల్లో సూక్ష్మపోషకాలు సరిపడా లేకున్నా నిర్దేశించిన ప్రమాణాల్లో అవి లేకున్నా పంట భూములు చౌడుగా మారతాయి. సూక్ష్మధాతు లోపం ఉన్నట్టు గుర్తించిన పొలాల్లో వీటిని వేయడం ద్వారా పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చు. క్రమం తప్పకుండా వినియోగిస్తే చౌడుబారిన భూములను సారవంతంగా మారుస్తాయి. భూసార పరీక్షల ద్వారా వీటి లోపాలను గుర్తించి ముందుగానే వినియోగిస్తే దిగుబడులు ఆశాజనకంగా లభిస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఉన్న 30 శాతం పంటభూముల్లో ఏదొక సూక్ష్మ పోషక లోపం ఉన్నట్టు పరిశీలనలో వెల్లడైంది.

వరి దిగుబడుల్లో జింక్ కీలక పాత్ర

వరి దిగుబడుల్లో జింక్‌కు అధిక ప్రాధాన్యత ఉంది. మొక్క ఎదుగుదలకు, నత్రజని, భాస్వరం, ఇతర పోషక పదార్థాల సమర్థ వినియోగానికి, మొక్కలో అమినో ఆమ్లాలు, మాంసకృత్తుల తయారీకి దోహదపడుతుంది. జింక్ లోపిస్తే ఆకుల ఈనెల మధ్య భాగం పసుపు రంగుకు మారి చిన్నవిగా అవుతాయి. పంటలో ఎక్కువ మోతాదులో నత్రజని, భాస్వరం ఎరువుల వాడకం వల్ల జింక్ లోపం వస్తుంది. ఒకేసారి వరి పండించే భూముల్లో ప్రతి మూడు పైర్లుకు ఒకసారి, రెండు పంటలు పండించే చోట రబీ సీజను ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. లోపం నివారణకు ఎకరాలకు 400 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. జింక్‌ను భాస్వరం ఎరువులతో కలిపి వేయకూడదు.

బోరాన్ ధాతు ప్రాముఖ్యత

వరితోపాటు అపరాలు, కాయగూరలు, పత్తి మొక్కల పూత దశలో సంపర్కం, ఫల దీకరణ, ఆకుల్లో తయారయ్యే ఆహారం మొక్కల్లోని అన్ని భాగాలకు చేర్చడంలో బోరాన్‌దే కీలక పాత్ర. సున్నంపాలు ఎక్కువుండే నేలల్లో బోరాన్ లోపం అధికంగా కనిపిస్తోంది. లోపం ఉన్న చెట్ల ఆకులు ముడుచుకుపోయి చిన్నవిగా తయారవుతాయి. కాయ దశలో కాయలు పగిలిపోతాయి. ఎకరానికి ఒక కిలో బోరాక్స్‌ను ఆఖరి దుక్కులో వేయాలి. బోరాన్ లోప నివారణకు ప్రతి మొక్కకు 100 గ్రాముల బోరాక్స్ లేదా బోరికామ్లాన్ని భూమిలో వేయాలి. 0.1-0.2 శాతం బోరాక్స్ లేదా బోరి కామ్లాన్ని కొత్తగా చిగురు వచ్చినప్పుడు 10-15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. నీటిపారుదల కింద సాగుచేసే పంటకు విత్తే సమయంలో ఎకరానికి నాలుగు కిలోల బోరాక్స్ వేయాలి.

జిప్సంతో చౌడు నివారణ

సూక్ష్మపోషకాల్లో కీలకమైన జిప్సం వినియోగించడం ద్వారా చౌడు భూములను తిరిగి పంటల సాగుకు అనుకూలంగా చేయవచ్చు. జిప్సం ఎరువులో కాల్షియం, గంధకం ధాతువులు ఉంటాయి. చౌడు భూముల్లో ఉండే మార్పిడి చెందే సోడియం తగ్గించి నేలను బాగు చేయడానికి జిప్సం ఎరువు అవసరం. జిప్సం ఎరువులోని కాల్షియం ధాతువు మొక్కలో కణకవచం తయారీకి, కణాల ఉత్పత్తి, సాగుదలకు, మొక్కల్లో సేంద్రియ ఆమ్లాలను తటస్థపరచడానికి, పత్రహరితం, క్రోమోజోములు ఏర్పడ్డానికి దోహదం చేస్తుంది. కారుచౌడు నేలలను బాగు చేయడానికి వేసవి వర్షాల సమయంలో జిప్సం వేసి కలియదున్నాలి. తర్వాత పొలంలో నీటిని నిలపాలి. భూసార పరీక్షా ఫలితాలకు అనుగుణంగా జిప్సం ఎరువు మోతాదును వేయాలి. అవి లేకుంటే ఎకరానికి 1.2-1.6 టన్నులు జిప్సం వేయవచ్చు. నూనె గింజల పంటలకు ఎకరాకు 200 కిలోల జిప్సం చివరి దుక్కిలో వేయాలి. వేరుశెనగ పైరుకైతే పూత దశలో వేసి నేలలో కలపాలి. సోయాచిక్కుడు, కంది, పెసర, మినుము, శనగ వంటి పైర్లకు జిప్సం ఎరువును చివరి దుక్కులో ఎకరానికి 50-100 కిలోలు వేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

మిగిలిన సూక్ష్మపోషకాలదీ ఇంతే..

ఇతర సూక్ష్మపోషకాల్లో కీలకమైన ఐరన్ ధాతు లోప నివారణకు ఎకరానికి 20కిలోల అన్నభేదిని ఆఖరి దుక్కులో వేయాలి. పైరుపై ఐరన్ ధాతు లోపాలు కనిపిస్తే ఎకరానికి ఒక కిలో అన్నభేది, 200 గ్రాముల సిట్రిక్ ఆమ్లాన్ని 200లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ఎకరానికి 10 కిలోల మాంగనీస్ సల్ఫేట్ చివరి దుక్కులో వేయాలి. మొక్కలో విటమిన్-ఎ తయారీకి దోహదం చేసే రాగి ధాతువు కోసం ఎకరానికి రెండు కిలోల కాపర్ సల్ఫేట్‌ను 2-3 సంవత్సరాలకు ఒకసారి దుక్కులో వేయాలి.

టీడీపీ హయాంలో 100% సబ్సిడీ

వరి సహా అన్ని రకాల పంటల సాగులో కీలక పాత్ర పోషించే సూక్ష్మపోషకాలైన జింక్, బోరాన్, జిప్సంలను 2019 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం భూసార పరీక్షలకు అనుగుణంగా నూరుశాతం సబ్సిడీపై ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం పథకం ద్వారా రైతులకు అందించింది. అంతకుముందు వీటిని 75-90 శాతం సబ్సిడీపై అందించేవారు. వీటిని రైతులు తమ భూములకు వినియోగించుకుని సత్ఫలితాలు పొందేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి సూక్ష్మపోషకాల సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. ఇప్పుడు పొలంబడి రైతులకు మాత్రమే ఇస్తున్న సూక్ష్మపోషకాలను గతంలో మాదిరిగా భూసార పరీక్షల ఆధారంగా నూరుశాతం సబ్సిడీపై అందించాలని రైతులు కోరుతున్నారు.

దివాన్‌చెరువులో ప్రభుత్వ పాఠ్య పుస్తక కార్యాలయం

పూర్వ తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 64 మండలాలకు ఇకపై ఇక్కడి నుంచే ఉచిత పాఠ్య పుస్తకాల సరఫరా



దివాన్‌చెరువు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేసే జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తక కార్యాలయం ఇటీవల దివాన్‌చెరువుకు మారింది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని ధవళేశ్వరంలో దాదాపు 13 సంవత్సరాలు ఉన్న ఈ కార్యాలయం కొన్ని కారణాల వల్ల ఇక్కడికి మారింది. దివాన్‌చెరువులో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న విశాలమైన భవనంలో దీనిని ఏర్పాటు చేశారు. పూర్వ తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 64 మండలాలకు ఈ కార్యాలయం ద్వారానే ఉచిత పాఠ్య పుస్తకాల సరఫరా జరుగుతుంది. దాంతో దాదాపు 40 లక్షల పాఠ్య పుస్తకాలు భద్రపరచుకునేందుకు అనువుగా విశాలమైన గోదాము ఉన్న భవనంలో ఈ కార్యాలయం ఏర్పాటైంది.

పాఠశాలల విద్యార్థులకు అందజేసేందుకు 18 లక్షల మూల్యాంకన పుస్తకాలు ఈ నెల 27వ తేదీకి దివాన్‌చెరువులోని జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తక కార్యాలయానికి చేరనున్నాయి. 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు అందజేసేందుకు 51 టైటిల్స్ మూల్యాంకన పుస్తకాలు రానున్నాయి. ఈ పుస్తకాలు ఇక్కడకు వచ్చాక ఈ కార్యాలయం నుంచి పూర్వ తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని అన్ని మండలాలకు సరఫరా చేస్తారు. ఈ విషయమై జిల్లా ప్రభుత్వ పాఠ్యపుస్తక కార్యాలయ మేనేజరు పి.సురేష్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా ఇంతవరకు తమ కార్యాలయానికి 40వేల మూల్యాంకన పుస్తకాలు వచ్చాయని చెప్పారు. మిగిలిన పుస్తకాలు కూడా వచ్చాక మండలాలకు సరఫరా చేస్తామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సెమిస్టర్ పుస్తకాల పంపిణీ పూర్తయ్యిందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు తగ్గుదల


ఏలేరు జలాశయంలో ఉన్న నీటి నిల్వలు

ఏలేశ్వరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి మట్టం తగ్గుతోంది. సాగు అవసరా లకు నీరు విడుదల చేస్తుండడంతో రిజ ర్వాయర్‌లోని నీరు క్రమేణా తగ్గుతూ వస్తోంది. వర్షాలు సకాలంలో రాకపోవ డంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. గతంలో ఎన్న డూ లేని రీతిలో ప్రాజెక్టులో 86.56 మీట ర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని ని ల్వ చేసే అవకాశం ఉంది. 77.10 మీటర్ల స్థాయిలో 10.31 టీఎంసీలు నిల్వలు ఉ న్నాయని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 150 క్యూ సెక్కులు, ఏలేశ్వరంలోని తిమ్మరాజు చె రువుకు 600 క్యూసెక్కుల వంతున నీరు వేరుతోంది. సాగు నీరు విడుదలవ్వడం తోసంటలపై రైతులకు భరోసా వచ్చింది.

సెటిల్ చేసుకోకపోతే షాప్ సీజ్ చేస్తాం!

- ఉమ్మడి జిల్లా పరిధిలోని మెడికల్ షాపుల నిర్వాహకులకు ఫేక్ కాల్స్
- డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి అంటూ బెదిరింపు
- కాకినాడ పోలీసులకు ఫిర్యాదు చేసిన జిల్లా కెమిస్టులు

పిఠాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మీరు కాలం చెల్లిన మందులు విక్రయిస్తున్నారు.. వయాగ్రా మాత్రలు అమ్మారు.. ఇలా మీ మీద ఫిర్యాదులు వస్తున్నాయి. మేము వచ్చే షాప్ సీజ్ చేస్తాం. మీరు వచ్చి డబ్బులు ఇచ్చి సెటిల్ చేసు కోండి అంటూ డీఎంహెచ్‌వో కార్యాలయం నుం చి ఫోన్ చేస్తున్నామంటూ కొందరు ఆగంతకులు మెడికల్ షాపు యజమానులకు ఫేక్ ఫోన్లు చేస్తున్నారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని పలు షాపుల నిర్వాహకులకు గత 3 రోజులుగా పదుల సంఖ్యలో ఫేక్ ఫోన్లు రావడంతో కాకినాడ జిల్లా డ్రగ్గిస్ట్ అండ్ కెమిస్ట్స్ అసోసియేషన్ అప్ర మత్తమైంది. కాకినాడ టూటౌన్ పోలీసుస్టేషన్ లో జిల్లా సంఘ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. కాకినాడతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, తుని, పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట, ఏలేశ్వరం తదితర ప్రాంతాల్లోని మెడికల్ షాపుల నిర్వాహ కులకు 7032461950 నెంబర్ నుంచి కాల్స్ వచ్చినట్టు చెబుతున్నారు. ఇది హైదరాబా దులోని ఒక కాల్ సెంటర్ నుంచి వచ్చినట్లు స మాచారం. ఇవన్నీ తప్పుడు కాల్స్ అని, ఇటువం టివి వచ్చినప్పుడు సంబంధిత రికార్డు చేయాలని డ్రగ్గిస్ట్ అండ్ కెమిస్ట్ అసోసియేషన్ ప్రతిని ధులు కోరారు. ఈ కాల్స్ చేసిన వారికి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూచించారు. దీనిపై ఇప్పటికే పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని వారు తెలిపారు.

లారీని ఢీకొన్న వ్యాన్

ఒకరి మృతి

మరొకరికి గాయాలు


ఘటనా స్థలంలో వాహనాలు


చంద్రశేఖర్ (ఫైల్)

ఆలమూరు/అంబాజీపే ట జూలై 22 (ఆంధ్రజ్యో తి): కోనసీమ జిల్లా ఆల మూరు మండలం మడికి వద్ద జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమా దంలో వ్యక్తి మృతిచెందారు. ఆలమూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడెం మండలం మిలటరీ మాధ వరానికి చెందిన వెంపల చంద్రశేఖర్(50) గత కొన్నేళ్లుగా అంబాజీపేట మండలం ఇరుసుమండలో నివాస ముంటూ డ్రైవ ర్‌గా పనిచేస్తున్నారు. ఐసర్ వ్యాన్‌తో సోమవారం అర్ధరాత్రి రాజమహేంద్రవరం వైపు వెళ్తుండగా రావులపాలెం వద్ద ఒక వ్యక్తి రాజమహేంద్రవరం వరకు వస్తానని వ్యాన్ ఎక్కాడు. ఆలమూరు మం డలం మడికి వద్ద కూరగాయల మార్కెట్ వద్ద సాంకేతిక లోపంతో ఆగి ఉన్న లారీని వ్యాన్ ఢీకొంది. దీంతో చంద్రశేఖర్ అక్కడి కక్కడే మృతిచెందగా వ్యాన్‌లో ఉన్న మరో ఒక వ్యక్తి గాయపడ్డాడు. దీంతో రాజమహే ంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఆలమూరు ఎస్‌ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుల్లెట్ ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు


రాముడు (ఫైల్)

పి.గన్నవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పి.గన్నవరం- అమలా పురం ప్రధాన రహదారి పోత వరం వద్ద జరిగిన రోడ్డు ప్ర మాదంలో వ్యక్తి మృతిచెందా డు. వివరాల ప్రకారం.. ము ంగండ శివారు ఇటుకల మెర కకు చెందిన మోకా కళ్యాణరాముడు (45) తన మేనల్లుడు గణేష్‌బాబుతో కలిసి పి.గన్నవరం వచ్చాడు. తన పని ముగించుకుని మోటా ర్‌సైకిల్‌పై ఇంటికి తిరిగి వెళ్తున్న సమయం లో కోళ్లపాలెం కల్యాణ మం డపం దాటి కొం చెం దూరం వెళ్లాక అమలాపురం వైపు నుంచి బుల్లెట్‌పై గన్నవరం వస్తున్న వ్యక్తి ఢీ కొన్నాడు. ఈ ఘటనలో కల్యాణరాము డు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందగా రవికుమార్‌కు గాయాలు కావడంతో గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కల్యాణరాముడు మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్టు ఎస్‌ఐ బి.శివకృష్ణ పేర్కొన్నారు.

చోరీ కేసులో 30 గ్రాముల బంగారం, రూ.30 వేల స్వాధీనం


రౌతులపూడిలో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లరావు

పోలీసుల అదుపులో ఇద్దరు బాలురు

రౌతులపూడి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో 30 గ్రాముల బంగారం, రూ.30 వేల నగదును రౌతులపూడి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకున్నారు. కాకినాడ జిల్లా రౌతులపూడి పోలీ స్‌స్టేషన్‌లో ఎస్‌ఐ జి.వెంకటేశ్వరరావు మంగళవారం విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈనెల 13న రౌతులపూడిలో పేంట మరియ మ్మ ఇంట్లో 30 గ్రాముల బంగారం, రూ.30,000 నగదు చోరీ జరిగింది. కేసు నమోదు చేసిన పోలీసులు ద ర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధా రాలతో రౌతులపూడికి చెందిన ఇద్దరు బాలురను మంగళవారం మధ్యాహ్నం రౌతుల పూడి గ్రామశివారు వరిదమ్మ గుడి వద్ద అదు పులోకి తీసుకున్నారు. సీసీఎస్ జిల్లా పేటా ముందు హాజరుపరిచామని ఎస్‌ఐ తెలిపారు. ద ర్యాప్తులో హెడ్‌కానిస్టేబుల్ డి.రిమణ, కానిస్టే బుళ్లు జోస్, నూకరాజు, ఉదయ్ ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ చంద్రశేఖర్

జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో మహిళా మెడికోల స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



సభలో మాట్లాడుతున్న వీసీ డాక్టర్ చంద్రశేఖర్, క్రీడాపతాకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రాజానగరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్ర శేఖర్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగ రం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో 3 రోజులపాటు జరిగే మహిళా మెడికోల 25వ స్పోర్ట్స్‌మీట్‌ను మంగళవారం ఆయన క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, బెలూన్లు గాలిలోకి వది లి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ వైద్య విద్యతో పాటు జీఎస్ఎల్ మెడికల్ క ళాశాలలో క్రీడా రంగానికి అధిక ప్రాధాన్య తనిస్తూ క్రీడా మైదానంలో మౌలిక సదుపా యాలు కల్పించడం అభినందనీయమన్నారు. యూనివర్సిటీ పరిధిలో జరిగే ఈ పోటీల్లో మొ త్తం 24 మెడికల్ అండ్ దంత వైద్య కళాశాలల నుంచి 567 మంది క్రీడాకారిణులు పాల్గొంటు న్నట్టు యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్ట ర్ ఇర్రిమూర్తి తెలిపారు. 3 రోజుల పాటు వా లీబాల్, త్రోబాల్, బాస్కెట్ బాల్, టెన్నిస్, టేబు ల్ టెన్నిస్, బాడ్మింటన్, చెస్ తదితర క్రీడలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. అనం తరం ముఖ్యఅతిథిని సత్కరించి జ్ఞాపిక అం దజేశారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డీవీఎస్ శ్రీనివాసరా వు, జీఎస్ఎల్ సంస్థల చీఫ్ మెంటర్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ మిశ్రా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని విద్యార్థి మృతి


వెంకటేష్ (ఫైల్)

కరప, జూలై 22(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ ఢీకొని కాలేజీకి వె ళ్తున్న విద్యార్థి మృతిచెందాడు. కరప ఎస్‌ఐ టి.సునీత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కరప మండలం వేళంగికి చెందిన కోసూరి వెంకటేష్(22) కాకినాడ ఆదిత్య కళాశాలలో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. వెంక టేష్ తండ్రి సుబ్రహ్మణ్యం కాకినాడలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి స్వాతి కొప్పెళ్ల టివారిపేటలో చిన్న హోటల్ నిర్వహిస్తోంది. సుబ్రహ్మణ్యం రోజూ కుమారుడిని బండిపై తీ సుకెళ్లి కాలేజీ వద్ద దింపి అక్కడి నుంచి డ్యూ టీకి వెళ్తేవాడు. మంగళవారం ఉదయం పని ఉందని చెప్పి తండ్రి ముందుగానే డ్యూటీకి వెళ్లిపోయాడు. దీంతో వెంకటేష్ కొద్ది నెలల క్రితం తండ్రి కొనిచ్చిన సుమారు రూ.4లక్షల విలువైన బుల్లెట్‌పై కళాశాలకు బయలుదేరా డు. వేళంగి దళమ్మచెరువుగట్టు వద్దకు వచ్చే సరికి కాకినాడ నుంచి వస్తున్న గుర్తుతెలియ ని మోటార్‌సైకిల్ వెంకటేష్‌ను బలంగా ఢీకొని ఆగకుండా పోయాడు. తలకు తీవ్రగాయాలైన వెంకటేష్‌ను తండ్రి సుబ్రహ్మణ్యం హుటాహు టిన కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలిం చగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీ కరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వివరించారు.

మినీ బస్సులో మరణం అంచుకు..

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- అరకు ఘాట్ రోడ్డులో మినీ బస్సు బోల్తా
- 21 మందికి గాయాలు
- లోయలో పడకుండా చూసిన డ్రైవర్
- బాధితులంతా రాజమండ్రి వాసులు
- విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స


ఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో మినీ బస్సు డ్రైవర్ కుమార్ స్వామి


బోల్తాపడిన మినీ బస్సు


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

శృంగవరపుకోట, జూలై 22(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు ఘాట్ రో డ్డులో మినీ బస్సు మంగళవారం బోల్తా కొట్టింది. ప్రమాదంలో 21 మందికి గాయాలయ్యాయి. డ్రైవర్ కుమార్‌స్వామి చాకచక్యంతో ఎవరికీ ప్రాణాపాయం కలగలేదు. బ్రేకులు ఫెయిలై లోయలో పడాల్సిన బస్సును కొండను ఢీకొనేలా చేయడంతో గాయాలతో బయటపడ్డామని క్షత గాత్రులు తెలిపారు. వారంతా విజయనగరం జిల్లా శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయ పడ్డవారంతా తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి వాసులు. వారితో మినీ బస్సులో ప్రయాణించిన ఎస్.నాని తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రి పరిసర ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు 20మంది వరకు రాజమండ్రి జేఎన్ రోడ్డులోని ఆడమ్ సెలూన్‌లో పనిచేస్తున్నారు. వీరంతా అరకు చూడాలనుకున్నారు. ఓ మినీ బస్సులో సోమ వారం రాత్రి రాజమండ్రి నుంచి బయలుదేరారు. మంగళవారం ఉదయం నుంచి బొర్రాగుహలు, అరకు, అనంతగిరి ప్రాంతాల్లో ఉన్న జలపాతా లను చూశాక సాయంత్రం రాజమండ్రికి తిరుగు ప్రయాణమయ్యారు. 6 గంటల సమయంలో శివలింగపురం, టైడా మధ్యకు వచ్చేసరికి మినీ బస్సుకు బ్రేక్‌లు ఫెయిల్ అయినట్టు డ్రైవర్ కు మార్‌స్వామి గుర్తించాడు. రోడ్డుకు ఒక పక్క లోయ, మరోపక్క కొండ ఉంది. బస్సు లోయవైపు లాగేస్తుండగా బస్సు ఆగకుండా చూసి మరోపక్క నున్న కొండను ఢీకొన్నాడు. దీంతో మినీ బస్సు బోల్తా పడింది. బస్సులో ఉన్న వారందరికీ సీట్లు, రాడ్లు, అద్దాలు తగిలి గాయపడ్డారు. కొందరికి తలకు తీవ్రగాయాలు కాగా మరి కొందరికి కాళ్లు, చేతులు విరిగాయి. ప్రమాదంపై శృంగవరపుకోట 108 వాహన ఉద్యోగులు ఎంఎస్ఎన్ మూర్తి, ర మేష్‌కు సమాచారం అందింది. వారు సంఘటనా స్థలానికి వెంటనే చేరుకుని తీవ్రంగా గాయప డ్డవారిని శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఎస్.కోట నుంచి మరో 108 వాహనంలో మరికొందరిని తీసుకొచ్చారు. మిగిలిన వారిని అల్లూరి జిల్లా అనంతగిరి ప్రభు త్వ ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌లో తెచ్చారు. వారందరికీ ఎస్.కోట ప్రభుత్వాసుపత్రి వైద్యులు చికిత్స అందించారు. డ్రైవర్‌తో సహా 21 మంది గాయపడ్డారు. డ్రైవర్ కుమార్ స్వామి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

అన్నవరం దేవస్థానం శానిటరీ కాంట్రాక్టర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కాంట్రాక్ట్ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టే అవకాశం

అన్నవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శానిటరీ వర్కర్లకు పీఎఫ్ చెల్లించకుండా నకిలీ ఈపీఎఫ్ రసీదులను చూపించి కాకి నాడ జిల్లా అన్నవరం దేవస్థానం అధికారు లను మోసం చేసిన విషయంలో కనకదుర్గ మ్యాన్‌పవర్ సర్వీసెస్ సంస్థపై మంగళ వారం రాత్రి దేవస్థానం శానిటరీ విభా గ అ ధికారులు ఫిర్యాదు చేశారు. ఉదయం ఈవో సుబ్బారావు, శానిటరీ విభాగ అధికారులు రాజమండ్రి పీఎఫ్ కార్యాలయానికి వెళ్లి విచ రాలు తీసుకుని న్యాయసలహా తీసుకున్నా రు. దీంతో అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఫి ర్యాదు చేశారు. ఎస్‌ఐ అందుబాటులో లేక పోవడంతో బుధవారం ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం ఉంది. సదరు కాంట్రాక్ట్ సం స్థపై చీటింగ్ కేసు నమోదు చేస్తారని సమా చారం. మరోవైపు కాంట్రాక్ట్ సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టే అవకాశం ఉంది. గార్డెన్ నందు ఇదే సంస్థ ద్వారా పలువురు సిబ్బంది పని చేస్తుండగా దానిని రద్దు చేసి మరో కాంట్రా క్ట్ సంస్థకు అప్పగిస్తారో వేచిచూడాలి.

పెరిగిన గోదావరి ప్రవాహం

83.208 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో విస్తారంగా కురుస్తు న్న వర్షాల వల్ల గోదావరికి వరద ప్రవాహం ఒక మోస్తరుగా పెరుగుతోంది. మంగళవారం సాయంత్రానికి తూర్పుగోదావరి జిల్లా ధవళే శ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి 83208 క్యూసె క్కులు మిగులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.90 అడుగు లుగా నమోదైంది. వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టాకు 3800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4700 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద నీటి మట్టం 16.30 అడుగులుగా నమోదైంది.

నేడు 'లోవ'లో సహస్ర ఘటాభిషేకం

తునిరూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన తలు పులమ్మ లోవ దేవస్థానంలో ఆషాఢ మాస ఉత్సవాలు ముగింపు వేడుకల్లో భాగంగా బుధవారం సహస్ర ఘటాభిషేకం నిర్వహించ నున్నట్టు ఆలయ పండితులు రాజశర్మ తెలి పారు. అమ్మవారి సన్నిధి జలాలతో అభిషే కించి వరుణపూజ నీరాజన మంత్రపుష్పాల తో పూజలు నిర్వహిస్తారన్నారు. 24వ తేదీతో ఆషాఢ మాసోత్సవాలు ముగుస్తాయన్నారు.

చినజగ్గంపేటలో ఆక్రమణలపై సర్వే

ఇరువర్గాల మోహరింపు, ఉద్రిక్తత

పోలీసు బందోబస్తు ఏర్పాటు


మోహరించిన ఇరువర్గాలను అదుపు చేస్తున్న పోలీసులు


ఆక్రమణలపై సర్వే చేస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

గొల్లప్రోలు రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చినజగ్గంపేటలో ఆక్రమణలపై అధికారుల సర్వే ఉద్రిక్తతలకు దారితీసింది. ఇరువర్గాలు భారీగా మోహరించడంతో పో లీసు బందోబస్తు మధ్య సర్వే కొనసాగించారు. గ్రామంలోని 17.35 ఎకరాల విస్తీర్ణంలో గల బూర వారి చెరువు, 14.35 ఎక రాల విస్తీర్ణంలోని వెంకటాజు చెరువు, ఎస్సీలకు ఇచ్చిన భూముల ఆక్రమణకు గుర య్యాయని కాకినాడ జిల్లా కలె క్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో కలె క్టర్ ఆదేశాల మేరకు పిఠాపురం తహశీల్దార్ పీవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో ఈశ్వర సంతోష్‌కుమా ర్, ఏఈ పద్మజ, మండల సర్వేయర్ కేదారేశ్వర రావు ఆధ్వర్యంలో సంయుక్త సర్వే చేపట్టారు. ఆక్రమణలను గుర్తించారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని 2 వర్గాలు మోహరించడంతో ఉద్రిక్తత నెలకొంది. గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామ కృష్ణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య సర్వేను కొనసాగించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

అమలాపురంలో ఇద్దరు వ్యక్తులపై బాధితుల ఫిర్యాదు

అమలాపురం రూరల్, జూలై 22(ఆంధ్రజ్యో తి): ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి లక్షలా ది రూపాయలు స్వాహా చేసిన వ్యక్తులపై బా ధితులు మంగళవారం రాత్రి తాలూకా పోలీసు లకు ఫిర్యాదు చేశారు. కోనసీమ జిల్లా అమలా పురం ఆకోనరకు చెందిన సిరిసపల్లి ఉద య్‌శంకర్, రావులపాలెనికి చెందిన దేవిపాటి మహేష్ మున్సిపల్ డిపార్టుమెంట్‌లో పనిచే స్తున్నామని నమ్మబలికారు. మున్సిపల్ డిపార్టు మెంట్‌లో రికార్డు అసిస్టెంట్, ఫీల్డు అసిస్టెంట్, అకౌంటెంట్ తదితర పోస్టులు ఉన్నాయని, పో స్టు ఒక్కింటికి రూ.1.20లక్షలు, రూ.2.50లక్షలు అవుతుందని ముందుగా సగం సొమ్ము అడ్వా న్సుగా ఇవ్వాలని నమ్మించారు. జాబ్ వచ్చిన త రువాత మిగిలిన సొమ్ము ఇవ్వవచ్చని చెప్పా రు. ఉద్యోగాల కోసం ఆశపడ్డ ఆరుగురు రూ. 7.20లక్షల సొమ్మును అమలాపురానికి చెందిన యల్లమిల్లి విజయ, ఉరదాల బాలరాజు, పేరూ రుకు చెందిన వాసర్ల శ్రీనివాస్ సమక్షంలో సొ మ్ములు చెల్లించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. నెలలు గడిచిపోతున్నా ఉద్యోగాలు ఇప్పించలే దు. ఎప్పుడూ ఏదో ఒక కారణం చెబుతూ త ప్పించుకుని తిరుగుతున్నారు. ఈ వ్యవహారంపై ఈనెల 12న ఉదయ్‌శంకర్‌ను పట్టుకుని పెద్ద మనుషుల సమక్షంలో పెట్టగా అతడు దేవిపా టి మహేష్‌తో ఫోన్‌లో మాట్లాడి ఉద్యోగాలు ఇప్పించడం కుదరదని, డబ్బులు తిరిగి చెల్లిస్తా మని పెద్దల సమక్షంలో నమ్మించారు. ఆ తరు వాత వాయిదాలు పెడుతూ స్విచ్ఛాఫ్ చేశాడు. ఒక దశలో రూ.6.40 లక్షల నకిలీ చెక్కును ఉదయ్ శంకర్ పెద్దల సమక్షంలో వేరొకరి సంతకంతో ఇచ్చాడు. ఆ చెక్కు చెల్లదని తమ సొమ్ములు తమకు నగదురూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి నుంచి తాము పెద్ద మనుషు ల చుట్టూ తిరుగుతూనే ఉన్నామని వివరించా రు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి మోసం చేసిన ఉదయ్‌శంకర్, మహేష్‌పై చట్ట పరమై న చర్యలు తీసుకోవాలని, తమ సొమ్ములు త మకు తిరిగి ఇప్పించాలని ఫిర్యాదులో కోరారు. అయితే ఈ వ్యవహారంపై అమలాపురం తా లూకా ఎస్‌ఐ శేఖర్‌బాబును వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీ సుకుంటామన్నారు. ఈ వ్యవహారంపై అమలా పురం పట్టణ, అల్లవరం పోలీస్‌స్టేషన్లలో సై తం బాధితులు ఫిర్యాదులు చేశారు. జలీవల దేవిపాటి మహేష్‌ను కొందరు కొట్టిన వీడియో లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేష్‌ను ఉన్నత వైద్యం కోసం కాకినాడ తరలిస్తున్నట్టు వైద్యులు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రాజానగరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి మరణించిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా జాతీయ రహదారి రాజానగరం-నరేంద్రపురం కూడలిలో మంగళ వారం జరిగింది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతానగరం మండలం ఒ మ్మంగికి చెందిన చవల శ్రీనివాస్(38) కొంత కాలంగా రాజానగరం మండలం నరేంద్రపు రంలో మరిదమ్మ తీర్థంలో కడియాలు అమ్ము కునేందుకు కొంతమారు నుంచి స్కూటీపై బయలుదేరాడు. రాజానగరం- నరేంద్ర పురం జంక్షన్ వద్ద లారీ వెనుక నుంచి ఢీకొం ది. శ్రీ నివాస్ తలకు బలమైన గాయాలు కావ డం తో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి త రలించగా మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు.

కోటి తలంబ్రాల పంటకు వానర హారతి




అచ్యుతాపురంలో వివిధ వేషధారణలతో వరిసాగు ప్రారంభిస్తున్న భక్తులు

గోకవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం అచ్యుతాపు రంలో శ్రీరామ నామ ధ్యాన జపంలో భాగంగా మంగళవారం కోటి తలంబ్రాల పంటకు వానర హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరామచ ర్యాన్ని ప్రచారం చేస్తున్న కళ్యాణం అప్పారావు చైతన్య సంఘం అధ్యక్షుడు కళ్యాణం అప్పారావు ఆధ్వర్యంలో కోటి తలంబ్రాల జ్ఞాన యజ్ఞం కొన సాగిస్తున్నారు. విత్తనం నుంచి తలంబ్రాల వరకు అంతా రామమయం అనే సద్భావంతో తొలు త విత్తనాలకు భద్రాచలం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో పూజలు చేయించారు. అనంతరం అక్కడ నుంచి అచ్యుతాపురం తీసుకొచ్చి క్యా ంప్ చక్రపాణి పొలంలో చల్లారు. రాముడు, ఆం జనేయుడు, సుగ్రీవుడు, జాంబవంతుడు వేషధా రణలతో భక్తులు ఈ వరిసాగు ప్రారంభించారు. పంట అనంతరం ధాన్యాన్ని నాలుగు రాష్ట్రాల్లోని 5వేల మందికి అందించి వారి ద్వారా వాటిని శ్రీరామ నామస్మరణతో గోటితో ఒలిచి 800 కిలోల తలంబ్రాలు సిద్ధం చేస్తారు. అనంతరం భద్రాచలం (15వ సారి), ఒంటిమిట్ట(8వ సారి), అయోధ్య(4వ సారి)లకు సమర్పించనున్నట్టు సంఘం అధ్యక్షుడు అప్పారావు పేర్కొన్నారు.

రంప మన్యంలో తగ్గిన మావోయిస్టు కార్యకలాపాలు : డీఎస్పీ

రంపచోడవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన నిరంతర, సమగ్ర అభి వృద్ధి కార్యక్రమాల కారణంగా రంపచోడవరం మన్యంలో మావోయిస్టు కార్యకలాపాలు గణనీ యంగా తగ్గాయని డీఎస్పీ జి.సాయి ప్రశా ంత్ మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. మావోయిస్టు సానుభూతిపరులు, భూగర్భ కా ర్యకర్తలు హింస మార్గాన్ని వదిలి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసు కోవాలని పిలుపునిచ్చారు. లొంగిపోయిన వ్య క్తులకు పునరావాస విధానాల ప్రకారం గౌరవ ప్రదమైన పునః ఏకీకరణకు ప్రభుత్వం కట్టు బడి ఉందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

'ఉపాధి' కార్యాలయంలో రేపు జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 22 (ఆంధ్రజ్యోతి): టీంలీజ్ సర్వీస్, ఎస్‌బీఐ గ్రూపుల్లో పని చేయడానికి జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి ఇ.వసంతలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల పురుషులు సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 8639846568 నెంబరును సంప్రదించాలన్నారు.

'అహంకారం వదిలి గురువులకు నమస్కరించాలి'



విజయానంద తీర్థ స్వామి చాతుర్మాస్య దీక్షా మహోత్సవంలో ప్రవచనం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు

పిఠాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మనం అహంకారం వదిలివేసి గురువులకు నమస్కారం చేసి పాదాభివందనం చేస్తే శరీరం గగుర్పాటుకు గురై తన్మయత్వానికి లోనవుతుందని ప్రముఖ ప్రవచనకర్త, ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని శ్రీపాదవల్లభ అనఘా దత్త క్షేత్రంలో మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి చాతుర్మాస్య దీక్ష మంగళవారం 13వ రోజుకి చేరింది. ఆయన్ను చాగంటి దర్శించుకున్నారు. అనంతరం భక్తులనుద్దేశించి మాట్లాడుతూ భగవంతుడికి కృతజ్ఞత చెప్పడంతో రోజు ప్రారంభం కావాలన్నారు. చేసిన ఉపకారం మర్చిపోతే నిష్కృతి లేదని తెలిపారు. రోజంతా శ్రమ పడి అలసిపోయిన శరీరానికి నిద్రతో ఉపశమనం లభిస్తుందని, ఇది భగవంతుడు మనకు కల్పించిన అవకాశమని చెప్పారు. భగవంతునికి చేసే అభిషేకాలు, పూజలు, నైవేద్యాల సమర్పణకు ఉన్న విశిష్టతలను వివరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: డీఎంహెచ్‌వో



గొల్లప్రోలు అర్బన్ హెల్త్ సెంటర్లో విచారణ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్

గొల్లప్రోలు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ హెచ్చరించారు. గొల్లప్రోలు అర్బన్ హెల్త్ సెంటర్లో వైద్యులు, సిబ్బంది రోగులకు సక్రమంగా సేవలు అందించట్లేదని, వారిపట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఉన్న పరికరాలు వినియోగించట్లేదని బొజ్జా ప్రసాద్ తదితరులు వైద్య-ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేశారు. దీంతో డీఎంహెచ్‌వో మంగళవారం గొల్లప్రోలు వచ్చి విచారణ చేపట్టారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఉన్న పరికరాలను వినియోగించి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఇకపై రోగుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. విచారణలో నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రాజెక్టు అధికారి డాక్టర్ జి.లక్ష్మి, గొల్లప్రోలు వైద్యాధికారి డాక్టర్ అమృతరావు, ఫిర్యాదుదారు బొజ్జా ప్రసాద్, స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొసిరెడ్డి రాజా, పడాల బాలరాజు, బొజ్జా బాబూరావు, సాల్మన్‌రాజు, రేకాటి నాగేశ్వరరావు, దమ్మాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

'నేత్ర సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం'



కంటి పరీక్ష చేయించుకుంటున్న కమాండెంట్ నాగేంద్రరావు

సర్పవరం జంక్షన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సర్వేంద్రియాల్లో నేత్రాలు అత్యంత ప్రధానమని, వాటి సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని ఏపీఎస్పీ కమాండెంట్ ముద్రగడ నాగేంద్రరావు పేర్కొన్నారు. సోమవారం రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో సూర్య ఐ కేర్-ఏఎల్ ఐ ఫౌండేషన్ సీఈవో రామ్‌ప్రకాశ్ ఆధ్వర్యంలో ఏపీఎస్పీ పోలీసులు, సిబ్బందికి ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 110 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్ మోహన్‌రావు, యూనిట్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ లక్ష్మి, ఆర్ఐలు, సూర్య ఐ కేర్ సిబ్బంది పాల్గొన్నారు.



రుణ బకాయిదారుల ఇళ్ల వద్ద ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహిస్తున్న డీసీసీబీ, సొసైటీల అధికారులు

'రుణాలు చెల్లించి సహకరించండి'

పిఠాపురం రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ద్వారా రుణాలు తీసుకుని చెల్లించని మొండి బకాయిదారుల ఇళ్ల వద్ద డీసీసీబీ, సొసైటీల అధికారులు, సిబ్బంది వినూత్నరీతిలో నిరసన తెలిపారు. అగ్రహారం, పి.రాయవరం సొసైటీల పరిధిలో గల పిఠాపురం పట్టణం, వెల్దుర్తి, పి.దొంతమూరు గ్రామాల్లో బకాయిల దారుల వద్దకు వెళ్లి రుణాలు చెల్లించి సహకరించాలని కోరారు. నిరర్థక ఆస్తులు తగ్గించుకోవడంలో భాగంగా మొండి బకాయిల వసూళ్లకు ఈ ప్రయత్నం చేస్తున్నామని అధికారులు తెలిపారు.

కార్యక్రమంలో డీసీసీబీ ఏజీఎం యెలిశెట్టి రమేష్, నోడల్ అధికారి వైసీహెచ్ శ్రీనివాస్, ఇంటర్నల్ ఆడిటర్లు ఎన్.భవానీ, రజని, రికవరీ మేనేజరు డి.సూర్యం, డీసీసీబీ పిఠాపురం బ్రాంచి మేనేజరు పీవీ రమణ, సొసైటీల సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

'పోలీసుల పాత్రపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి'

పెద్దాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహాల నిర్వహణలో పోలీసుల పాత్రపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ మాట్లాడుతూ పెద్దాపురంలో వ్యభిచార గృహాల నిర్వహణపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోందని, ఇందులో పోలీసుల సహకారాన్ని బాధిత మహిళ ప్రస్తావించిందన్నారు.. పెద్దాపురం నుంచి ఇతర ప్రాంతాలకు మహిళలను తీసుకెళ్తున్నా పోలీసులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, యాసలపు రమేష్, గడిగట్ల సత్తిబాబు, దారపురెడ్డి కృష్ణ, నరసింహమూర్తి, రమణ తదితరులు పాల్గొన్నారు.

'బాలల అక్రమ రవాణాను నిర్మూలించాలి'



రైల్వే స్టేషన్ ఆవరణలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సామర్లకోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బాలల అక్రమ రవాణా నిర్మూలనను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సామర్లకోట రైల్వే స్టేషన్ మాస్టర్ శ్రీదేవి పిలుపునిచ్చారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అలెర్ట్ స్వచ్ఛంద సంస్థ, సామర్లకోట ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. గోడ పత్రికలను స్టేషన్ మాస్టర్ శ్రీదేవి, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ వరప్రసాద్ ఆవిష్కరించారు. మానవ అక్రమ రవాణా, అనుమానాస్పద సంఘటనలపై ఆర్పీఎఫ్ సిబ్బంది, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098కు సమాచారం అందివ్వాలని సూచించారు. అలెర్ట్ సిబ్బందిని కూడా సంప్రదించవచ్చన్నారు. విశ్వనాథ్, అలెర్ట్ ప్రతినిధులు శీలా శ్రీను, బి.నాగార్జున, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి, వెంకటేష్, నాగేశ్వరరావు, శ్రీను, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

'మంద కృష్ణ పర్యటనను విజయవంతం చేయాలి'

కరప, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 25న కాకినాడ జిల్లాకు విచ్చేస్తున్న 'పద్మశ్రీ' మంద కృష్ణమాదిగ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పసుపులేటి చిన్నబాబుమాదిగ కోరారు. సోమవారం రాత్రి ఆయన వాకాడలో సంఘ నాయకులతో కలిసి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సంఘాల నూతన కమిటీలు, జెండా దిమ్మల ఏర్పాటుకు తీర్మానించారు. గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కరప మండల ఇన్‌చార్జి పలివెల రమేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కాకినాడ జిల్లా సహ ఇన్‌చార్జిలు పలివెల నవీన్‌మాదిగ, దేవారపు సురేష్, సూరిపాక వాసుదేవరావు మాదిగ, తాతపూడి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ టాక్స్ తగ్గింపుపై హర్షం



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న లారీల యజమానులు

సామర్లకోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మోటారు వాహనాలపై గత ప్రభుత్వం విధించిన గ్రీన్ టాక్స్‌ను తగ్గించి యజమానులతో పాటు పలు కుటుంబాలను ఆదుకున్నది కూటమి ప్రభుత్వమేనని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. గ్రీన్ టాక్స్ తగ్గించినందుకు కృతజ్ఞతగా సామర్లకోట లారీ స్టాండ్ కార్యాలయ ఆవరణలో మంగళవారం లారీ ఓనర్స్, వర్కర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబులకు లారీ స్టాండ్ యూనియన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, లారీల యజమానులు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్ (చిన్ని), బలుసు శ్రీనివాసు, వాడపర్తి వీరభద్ర రావు, పెద్దిరెడ్ల కృష్ణ, పెంకే వెంకటలక్ష్మి, వల్లూరి దొరబాబు, నిమ్మకాయల కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





కాకినాడ, పెద్దాపురంల్లో అచ్యుతానందన్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అసమాన్య ప్రజా నేత అచ్యుతానందన్

సీపీఎం నాయకుల నివాళి

కాకినాడ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అశేష ప్రజాభిమానం చూరగొన్న అసమాన్య ప్రజా నేత అచ్యుతానందన్ అని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. నగరంలోని సుందరయ్య భవన్‌లో సీపీఎం సీనియర్ నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ సంస్మరణ సభను ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.రాజశేఖర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కమిటీ సభ్యుడు దువ్వా శేషబాబ్జీ మాటాడుతూ 2006 నుంచి 2011 వరకు కేరళ ముఖ్యమంత్రిగా ప్రజారంజక పాలన అందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు కేఎస్ శ్రీనివాస్, సీహెచ్ రాజ్‌కుమార్, నగర కన్వీనర్ పలివెల వీరబాబు, సభ్యులు కె.సత్తిరాజు, మలకా వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, రూరల్ కమిటీ సభ్యులు టి.నాగేశ్వరరావు, పి.రామకృష్ణ, టి.రాజా, చంద్రమళ్ల పద్మ, మేడిశెట్టి వెంకటరమణ, యు.సత్యనారాయణ, టి.రాణి పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం పొలిట్‌బ్యూరో పూర్వ సభ్యుడు వీఎస్ అచ్యుతానందన్‌కు సీపీఎం నేతలు నివాళులర్పించారు. వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో ఆయన చిత్రపటానికి క్రాంతికుమార్, రొంగల వీర్రాజు, కృష్ణ, అప్పన్న, మరిడియ్య పూలమాల వేశారు.

పీ4 లీడ్ సర్వేకు ప్రజలు సహకరించాలి



టెలి కాన్ఫరెన్స్‌తో అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కమిషనరు సుధాకర్

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 22 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పీ4 కార్యక్రమంలో భాగంగా నగరంలో 1,500బంగారు కుటుంబాలను గుర్తించామని అదనపు కమిషనరు కేటీ సుధాకర్ తెలిపారు. మంగళవారం ఆయన నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి సచివాలయాల సిబ్బందితో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి పీ4 లీడ్‌పై సమీక్షించారు. ప్రతి కుటుంబాన్ని కలిసి ఇంటింటికీ కుళాయి, విద్యుత్ కనెక్షన్, దీపం-2, రేషన్ సరుకులు, ఇతర సదుపాయాలు, సామాజిక పింఛను సక్రమంగా అందుతోందా, తల్లికి వందనం, విద్యార్థిమిత్ర కిట్లు, ఇతర సంక్షేమ పథకాల వివరాలను ఏవిధంగా నమోదు చేయాలో అవగాహన కల్పించారు. 1,500 బంగారు కుటుంబాలను నగరపాలక సంస్థ ఉద్యోగులు దత్తత తీసుకున్నారని వివరించారు. సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న వారు కూడా ముందుకు వచ్చి కొన్ని కుటుంబాలను దత్తత స్వీకరించాలని సూచించారు. పీ4 లీడ్ సర్వేకు వచ్చే సచివాలయాల ఉద్యోగులకు ప్రజలందరూ సహకరించి సమాచారం అందించాలని సుధాకర్ కోరారు. సమావేశంలో ఉప కమిషనరు కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి సమర్పించేందుకు సిద్ధం చేసిన సారె

నేడు బాలాత్రిపురసుందరి అమ్మవారికి

శాకంబరీ అలంకారం

సామర్లకోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరి అమ్మవారికి బుధవారం శాకంబరీ అలంకరణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న, వినయ్ పర్యవేక్షణలో సారెకు సంబంధించి 108 రకాల మిఠాయిలను అమ్మవారి మందిరానికి చేర్చారు. సుమారు 10 టన్నుల పరిమాణంలో వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు, పుష్పాలను దీపారాధన సంఘం సభ్యులు మాలలుగా కట్టి ఆలయ ఆవరణను సర్వాంగసుందరంగా అలంక రించే పనుల్లో నిమగ్నమయ్యారు. వందలాది మహిళా భక్తులతో గ్రామ దేవత నూకాంబికా అమ్మవారి ఆలయం నుంచి పసుపు కొమ్ములు, చీర, సారెలను ప్రదర్శనగా భీమేశ్వరాలయానికి తీసుకెళ్లారు.

26న 'బుద్ధునితో నా ప్రయాణం'

నాటక ప్రదర్శన

తాళ్లరేవు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పాత బస్టాండు సెంటర్లోని అంబేడ్కర్ భవనంలో ఈ నెల 16న జరిగే 'బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలని తాళ్లరేవు బుద్ధిస్ట్ సొసైటీ అధ్యక్షుడు పినిపే నాగేంద్రరావు కోరారు.. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, అభిమానులు హాజరై నాటక ప్రదర్శనను తిలకించాలని కోరారు.



ఎమ్మెల్యే కొండబాబుతో కొత్తూరు మదీనా మసీదు కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు

కొత్తూరు మదీనా మసీదు కమిటీ నూతన కార్యవర్గం

కాకినాడ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామకృష్ణారావుపేట ఇస్మాయిల్ వీధిలో గల కొత్తూరు మదీనా మసీదులో జమాత్ పెద్దలు, యువకుల ఆధ్వర్యంలో కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ షరీఫ్ కుతుబుద్దీన్, కార్యదర్శిగా అబ్దుల్ రహమాన్‌ఖాన్, కోశాధికారిగా షేక్ అహ్మద్ ఆలీషా, కార్యవర్గ సభ్యులుగా ఎండీ రఫీయుద్దీన్, షేక్ బాబ్జీ, సాహెబ్ జానీ, కౌసర్, ఎండీ అలీషా, షాజహాన్, ఎండీ అబ్దుల్ గాలిబ్, హుస్సేన్ బాబ్‌జీ ఎన్నికయ్యారు. వీరంతా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఎండీ ఖాన్, ఎస్‌కె రహీం, ఎండీ అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ అభిమానుల సందడి



భానుగుడిలో కేక్ కట్ చేస్తున్న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ సుధీర్, పవన్ అభిమానులు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 22 (ఆంధ్ర జ్యోతి): తమ అభిమాన నటుడు పవర్ స్టార్ పవన్‌కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' గురువారం విడుదలవుతున్న సందర్భంగా మంగళవారం భానుగుడి కూడలిలో జనసేన నాయకుడు, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. పవన్, మెగా అభిమానులు, వీర మహిళలు పాల్గొన్నారు.

వేలంపాటలో చేప దక్కిందోచ్!



వేలంపాటలో దక్కించుకున్న చేపలతో గ్రామస్తులు

కరప, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కరప సమగ్ర రక్షిత మంచినీటి చెరువు (సీపీడబ్ల్యూ)లోని చేపల పట్టుబడి కోలాహలంగా జరిగింది. సుమారు 8 ఎకరాల ఈ చెరువులోని చేపలకు అధికారులు కొద్ది రోజుల క్రితం బహిరంగ వేలంపాట నిర్వహించగా స్థానిక అగ్నికుల క్షత్రియులు రూ.40వేలకు దక్కించుకున్నారు. గోదావరి నీటిలో పెరిగిన చేపలు కావడంతో ఎంతో రుచిగా ఉంటాయనే భావనతో వాటిని దక్కించుకోవడానికి ప్రజలు ఎగబడ్డారు. కేజీ రూ.150కు విక్రయిద్దామనుకున్న నిర్వాహకులు జనాల రద్దీతో సోమవారం వేలంపాట నిర్వహించారు. ఐదు నుంచి పది కిలోల వరకు ఉన్న వివిధ రకాల చేపలను రూ.1,500 నుంచి రూ.2,500 వరకు పాటపాడి దక్కించుకున్నారు. సుమారు 100 భారీ చేపలను విక్రయించగా రూ.1.60 లక్షలు సమకూరినట్టు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. అయితే వేలంపై స్థానికుల నుంచి పలు విమర్శలు వ్యక్తమయ్యాయి. కిలో లెక్కన అమ్ముతామని చెప్పి వేలం నిర్వహించడం, గ్రామస్తులకు కాకుండా బయట వ్యక్తులకు విక్రయించడం, పాటదారుల్లో ఒక వ్యక్తి చేసిన ఓవర్ యాక్షన్, కొన్ని చేపలను అక్కడి నుంచి తప్పించడం వంటి ఘటనలతో చేపల విక్రయం వివాదాస్పదమైంది.

పాడా ఇన్‌చార్జి పీడీగా

సత్యనారాయణ



పిఠాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పిఠాపు రం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్‌గా హౌసింగ్ పీడీ, స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎస్వీవీ సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పీడీగా ఎ.చైత్రవర్షిణి వ్యక్తిగత కారణాలతో సెలవు పెట్టడంతో ఆయన్ను ఇన్‌చార్జిగా నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

అట్టడుగు పేదల సాధికారతే

ప్రభుత్వ లక్ష్యం

కలెక్టర్ షాన్‌మోహన్

పెద్దాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పీ4 కార్యక్రమం ద్వారా అట్టడుగున ఉన్న పేదల సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ షాన్ మోహన్ పేర్కొన్నారు. ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఉన్న పీ4 కార్యాలయ భవనాన్ని మంగళవారం ఆయన ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో కలిసి పరిశీలించారు. భవన వివరాలను ఆర్డీవో శ్రీరమణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దారు సీహెచ్ వెంకటలక్ష్మి, మున్సిపల్ కమిషనరు కె.శ్రీకాంత్‌రెడ్డి, డీఈ ప్రకాశరావు వున్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ



తాళ్లరేవు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పిల్లంకలో శ్రీప్రసన్న ఆంజనేయస్వామిని అర్చకులు మంగళవారం పూలదండలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.



కాకినాడ డిపో నుంచి బయలుదేరిన బస్సు

రామేశ్వరం యాత్ర

స్పెషల్ బస్సు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం సందర్భంగా కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి మంగళవారం రామేశ్వరం యాత్ర స్పెషల్ బస్సు బయలుదేరింది. ఇది కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పళని, తివేంద్రం, కన్యాకుమారి, తిరుచందూరు, రామేశ్వరం, చిదంబరం, కుంభకోణం, తంజావూరు, తిరుత్తణి, శ్రీకాళహస్తి దర్శనం తర్వాత ఈ నెల 28వ తేదీ రాత్రి 9 గంటలకు కాకినాడ చేరుతుందని డిపో మేనేజరు మనోహర్ తెలిపారు. రామేశ్వరం యాత్రకు ఆసక్తి గలవారు 7382910869 నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

'భూమి ఆరోగ్యాన్ని మెరుగుపరచాలి'

కరప, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాల కోసం భూమి ఆరోగ్యాన్ని మెరుగుపరచాల్సిన ఆవశ్యకత ఉందని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ప్రణామం అనే పథకాన్ని తీసుకొచ్చిందని శాస్త్రవేత్తలు ఎ.సీతారామశర్మ, ఎలియాజర్ తెలిపారు. మండలంలోని నడకుదురు సచివాలయంలో మంగళవారం సేంద్రియ వ్యవసాయంపై రైతులకు ఏర్పాటుచేసిన శిక్షణ తరగతుల్లో వారు మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థ మద్రాసు ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి కంపెనీ అదనపు మేనేజరు కిషోర్‌బాబు హాజరై మాట్లాడారు. అధిక మోతాదులో రసాయనిక ఎరువుల వినియోగంతో సారం కోల్పోయిన భూమిని పునరుద్ధరించేందుకు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. సేంద్రియ ఎరువు ప్రోమ్, వేప ఆధారిత పురుగు మందు విజయ్ ఉత్పత్తులను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఎంపీటీసీ పైలా రామతులసిగోవిందు, డీఆర్సీ ఏడీఏ మాల కొండయ్య, ఎస్టీఎల్ ఏడీఏ మాధవి, మండల వ్యవసాయాధికారి ఇమ్మిడిశెట్టి సత్య తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త విభజనపై అవగాహన

కరప, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎల్పీవో అన్నామణి మంగళవారం పెద్దాపురప్పాడులో పర్యటించి తడి, పొడి చెత్త విభజనపై మహిళలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించి వాటిని వాడొద్దని హితవు పలికారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌పై అవగాహన కల్పించారు. పారిశుధ్య సిబ్బంది క్రమం తప్పకుండా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలని సూచించారు. సంపద తయారీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి పినిశెట్టి వీరభద్రరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రకృతిని కాపాడుకుందాం'

ఏలేశ్వరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి ప్రకృతిని కాపాడుకుందామని ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు సఖిరెడ్డి విజయబాబు అన్నారు. మంగళవారం స్థానిక ఆగ్జీలియం పాఠశాల ఆవరణలో పీపీపీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో రౌతు సహదేవుడు తదితరులు ఉన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఇచ్చిన హామీని ఎప్పుడు

అమలు చేస్తారు?

మరో పోరాటానికి డొంకరాయి వాసులు సిద్ధం

మోతుగూడెం, జూలై 22(ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలాన్ని పునర్విభజించి అన్ని వసతులు, అంతరాష్ట్ర రహదారి ఉన్న డొంకరాయి గ్రామాన్ని మండల కేంద్రంగా చేస్తూ నూతన మండలం ఏర్పాటు చేయమని 2014 నుంచి ఈ ప్రాంత ప్రజలు పలు పోరాటాలు చేశారు. 2016లో మండల స్థాన కమిటీ నాయకుడు, అధ్యక్షుడు కరకా వెంకటరమణ సారథ్యంలో 147 రోజులు రిలే నిరాహార దీక్షలు కూడా చేశారు. వారి పోరాటానికి అనేక మంది ప్రజా ప్రతినిధులు మద్దతు తెలిపారు. వారి పోరాటం ఫలితంగా అప్పటి రంపచోడవరం ఐటీడీఏ పీవో డొంకరాయి గ్రామాన్ని మండల కేంద్రంగా చేస్తామని లిఖితపూర్వక హామీ ఇచ్చారు. దీంతో డొంకరాయి ప్రాంత గిరిజన ప్రజలు పోరాటానికి విరామం ఇచ్చారు. తర్వాత కాలంలో ప్రభుత్వం మారడంతో ఈ అంశం మరుగున పడింది. మరలా కూటమి ప్రభుత్వం వచ్చాక డొంకరాయి అంశాన్ని అధికారుల వద్దకు ఆయన తీసుకెళ్ళారు. అప్పటి ఐటీడీఏ పీవోగా ఉన్న దినేష్‌కుమార్, ఇప్పటి అల్లూరి జిల్లా కలెక్టర్‌గా ఉన్నారు. అప్పుడు ఈ ప్రాంత ప్రజలకి ఇచ్చిన హామీని ఉల్లంఘించి ప్రభుత్వం వద్దకు వేరే ప్రతిపాదనలు పంపారు. దీనిపై మండిపడిన డొంకరాయి ప్రాంత గిరిజన ప్రజలు తమకు అధికారులు, ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సుమారు 170 కిలోమీటర్ల దూరంలో ఉన్న వై.రామవరం మండలం కేంద్రం అవ్వడం వల్ల 35 ఏళ్లుగా తాము అభివృద్ధికి, పరిపాలనకి దూరమయ్యామని వారు ఆరోపిస్తున్నారు. మరల మమ్మల్ని 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుర్తేడు ప్రాంతంలో కలిపి మమ్మల్ని 50 ఏళ్ల వెనక్కి నెట్టొద్దని వారు కోరారు. లేనిపక్షంలో తాము మరో ప్రజా పోరాటానికి వెనుకాడబోమని పిలుపునిచ్చారు. అప్పట్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని వారు కోరుతున్నారు.

పిక్నిక్ స్పాట్‌లో 'అఖండ 2' షూటింగ్


సినీ దర్శకుడు బోయపాటి శ్రీనుతో పొల్లూరు మహిళలు

మోతుగూడెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో మంగళ వారం అఖండ2 చిత్రీకరణ మోతుగూడెం పర్యాటక ప్రాంతాల్లో పిక్నిక్ స్పాట్ దగ్గర ప్రారంభమైంది. షూటింగ్‌లో కథానాయకుడు నందమూరి బాలకృష్ణ పాల్గొన్నారు. అనంతరం మోతుగూడెం ఏపీ జెన్కో అతిథిగృహంలో నెంబర్ వన్‌సూట్‌లో ఉన్నారు. షూటింగ్ అనంతరం సినీ దర్శకుడు బోయపాటి శ్రీనుతో పొల్లూరు మహిళలు ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి

దేవీపట్నం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏడాది పాటు చేసిన సుపరిపాలనలో సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. మంగళవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఫజుల్లాబాద్ గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ కె.శ్రీనివాస్‌యాదవ్, మండల కన్వీనర్ మరిశెట్ల వెంకటేశ్వరరావు, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, ముచ్చు వీరవెంకట సత్యనారాయణ, రేలంగి రాంబాబు, దాకారపు సత్యనారాయణ, శివాజీ, శివ, పెద్దసుబ్బారావు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి సమావేశం ఏర్పాటు చేయాలి


ఐటీడీఏ పీవోకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

రంపచోడవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసున్న ఆశకార్యకర్తల సమస్యల పరిష్కారానికి వైద్య, ఆరోగ్యశాఖాధికారులతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ల వాణిశ్రీ అన్నారు. మంగళవారం ఆశవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, ఏడీఎంహెచ్‌వో జి.శిరీషను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. నెలాఖరు నాటికి రెండు ఐటీడీఏల పరిధిలో జాయింట్ సమావేశం ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో విధులు బహిష్కరించి సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కంభం శాంతిరాజు, ఆశవర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, వీరలక్ష్మి, మంగ, మార్త లాలీబాయ్, శాంతమ్మ పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం విద్యాభివృద్ధికి చర్యలు


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కార్యాచరణ ప్రణాళిక ప్రకారం విద్యాభివృద్ధికి చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని విద్యాశాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. గిరిజన విద్యార్థులు ఐఐటీ, నీట్, ఇంజనీరింగ్ ప్రవేశాల్లో ఎక్కువ సీట్లు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏటీడబ్ల్యువోలు రామతులసి, కృష్ణమోహన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్రవంతి, 11 మండలాల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుల ఎంపికపై అభిప్రాయ సేకరణ

దేవీపట్నం, జూలై 22(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ దేవీపట్నం మండల అధ్యక్షుల ఎంపికపై ఇందుకూరుపేట కార్యాలయం వద్ద అభిప్రాయ సేకరణ నిర్వహించారు. మండలంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, అడహక్ కమిటీ సభ్యుల నియోజకవర్గ పరిశీలకులు కె.శ్రీనివాస్ యాదవ్, మండల పరిశీలకులు ప్రశాంత్‌కుమార్ అభిప్రాయాలు తెలుసుకున్నారు. మండల కమిటీ అధ్యక్ష అభ్యర్థులు మరిశెట్ల వెంకటేశ్వరరావు, గోళ్ల చంటిబాబు, ముచ్చు నాగేశ్వరరావు ముగ్గురు పోటీలో ఉన్నారు. తుది నిర్ణయం హైకమాండ్ నిర్ణయిస్తుందని పరిశీలకులు తెలిపారు.

ఒక ఊరికి..ఒకేచోట పునరావాసం కల్పించాలి

కూనవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఒక ఊరికి...ఒకేచోట పునరావాసం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక గ్రామానికి ఒకే చోట కాకుండా ముక్కలుగా విడదీసి పునరావాసం కల్పించేందుకు అధికారులు చూస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. దీనివల్ల ప్రజలు ఇబ్బంది పడతారన్నారు. వెంటనే ఆర్అండ్ఆర్ పీడీఎఫ్ జాబితా విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు నాచుపల్లి వెంకటేశ్వరావు, తలగాని నాగరాజు, తాళ్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రహదారి ఇలా.. పాఠశాలకు వెళ్లేదెలా?


సీతారాంపురంలో అధ్వానంగా ఉన్న పాఠశాలకు వెళ్లే రహదారి

తొండంగి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు పాఠశాలకు వెళ్లేందుకు దారి సరిగా అనేక అవస్థలు పడుతున్నారు. మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఉన్న మోడల్ ప్రాథమిక పాఠశాలలో 104 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. వారితో పాటు ఐదు గురు ఉపాధ్యాయులు విధులకు హాజరవుతున్నారు. వారంతా అధ్వానంగా ఉన్న మార్గం ద్వారానే పాఠశాలకు చేరుకోవాల్సి వస్తోంది. రహదారి మొత్తం ఛిద్రమయ్యింది. భారీ వాహనాలు ఈ ప్రాంతంగుండా వెళ్లడంతో లోతుగా గోతులు పడి వర్షం నీటితో నిండిపోయింది. విద్యార్థులంతా గోతుల మార్గం గుండానే పాఠశాలకు వెళ్లాల్సి వస్తున్నా ఈ మార్గాన్ని బాగుచేసే నాథుడు కరువయ్యారు. పాఠశాలకు వెళ్లే మార్గాన్ని తక్షణం బాగు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి


పెద్దనాపల్లిలో రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ

ఏలేశ్వరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దనాపల్లిలో ఉద్యానవన అధికారిణి దివ్యశ్రీ నేతృత్వంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యాన పంటల సాగు విస్తరణకు బిందు తుంపర సేద్య పరికరాలు రాయితీపై పొందవచ్చాన్నారు. ప్రతీరైతు విధిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి పసల్ బీమా యోజన ద్వారా వరి పొలానికి ఇన్సూరెన్సు కల్పిస్తుందన్నారు. సర్పంచ్ బుద్ధ సూర్యప్రకాష్ రైతులకు విత్తనాలు, పురుగుల మందులందజేశారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం


భోజనాలు వడ్డిస్తున్న జనసేన నాయకులు

జగ్గంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్‌ని ర్వహిస్తున్నారు. ఈ వారం జనసేన నాయకులు పేదలకు భోజనాలు వడ్డించారు. మాదాక వీరబాబు, కురుమళ్ళ నాగేశ్వరరావు, ముత్యాల వెంకటరాజు, సత్తి సోమరాజు, అంకం ఓం కృష్ణ, అడబాల వీరబాబు, డ్రిల్ మాస్టర్ శ్రీమన్నారాయణ, శివరామకృష్ణ ఉన్నారు.

'నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి'


గౌరవ వందనం స్వీకరిస్తున్న అగ్నిమాపకాధికారి రాముడు

తునిరూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని తుని అగ్నిమాపకాధికారి కె.రాముడు పేర్కొన్నారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో స్కూల్ కెప్టెన్ హౌస్ కెప్టెన్ల ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాముడు మాట్లాడుతూ చదువుకునే వయస్సులో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్ ద్వారా గౌరవ వందనాన్ని స్వీకరించారు. నాయకులుగా ఎంపికైన విద్యార్థులతో నాయకత్వ లక్షణాలను సక్రమంగా నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, ప్రధానోపాధ్యాయులు బి.సీతారాణి, బి.ప్రసూనమౌళి తదితరులు పాల్గొన్నారు.

'అందని తల్లికి వందనం పథకం'

జగ్గంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్నా మాకు తల్లికి వందనం పథకం రాలేదని గ్రామపంచాయతీ ఆఫీస్, ఎలక్ట్రికల్ అధికారులు, రెవెన్యూ అధికారుల వద్దకు ఎన్నిసార్లు తిరిగినా న్యాయం జరగడం లేదని కొందరు బాధితులు సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్రను ఆశ్రయించారు. బాధితులతో కలిసి తహశీల్దార్ రమేష్, ఎలక్ట్రికల్ ఏఈ మాధురిని కలిసి తల్లికి వందనం సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూర్యచంద్ర కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ సుమారు 10 నుంచి 20 మంది ప్రతిరోజు ఆఫీసుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారన్నారు. తల్లికి వందనం పెండింగ్ లిస్టులతో 4 మండలాల్లో ఉన్న అధికారులతో ఎమ్మెల్యే నెహ్రూ సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

'ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు'

జగ్గంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల్లో ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. జగ్గంపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థులంతా కలిసిమెలసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రఘునందన్‌రావు, ప్రిన్సిపాల్ లలితకుమారి, వైస్ ప్రిన్సిపాల్ కుమారి పాల్గొన్నారు.

పాఠశాలకు 20 కుర్చీల బహూకరణ

ప్రత్తిపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిపాలెం మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలకు మంగళవారం రంగంపేటకు చెందిన దాత కారె దాసు 20 కుర్చీలను బహూకరించారు. పెద్దిపాలెం పాఠశాల వద్ద యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కోడి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డికు కారె దాసు తనయుడు కారె ప్రదీప్‌కుమార్, సోదరుడు నూకరాజు ఈ కుర్చీలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కుర్చీల కొరత నివారణకు దాత కారె దాసు తోడ్పాటునందించడం పట్ల ప్రధానోపాధ్యాయుడు, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.


పెద్దిపాలెంలో కుర్చీలు అందజేస్తున్న దాతలు

పలుచోట్ల పొలం పిలుస్తోంది కార్యక్రమాలు


జగ్గంపేట రూరల్ : కాండ్రేగులలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

జగ్గంపేట రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మల్లిశాల, కాండ్రేగులలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలన్నారు. ప్రధాన మంత్రి పసల్ బీమాయోజన కింద ప్రతి ఒక్క రైతు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని అలాగే ప్రతి కౌలు రైతు కూడా తప్పనిసరిగా కైలు కార్డులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.నరసింహం, హార్టికల్చర్ అధికారి శ్రీవల్లి రైతులు పాల్గొన్నారు.

కోటనందూరు(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని ఏవో కెచంద్రశేఖర్ అన్నారు. టిజెనగరం, బొద్దవరంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. విత్తనాల శుద్ధి వల్ల తెగుళ్ల బెడద తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో జగ్గఅప్పారావు, సుర్ల రాంబాబు,సుర్లనాని తదితరులు ఉన్నారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులు లాభాలు పొందచ్చని మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వర్ అన్నారు. రాజవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వివరించారు. మినుములు, రాగులు విత్తనాలను అందజేశారు. టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు లాలం కృష్ణవేణి, చింతకాయల రాజుబాబు, ఈగల సత్తిబాబు ఉన్నారు.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారిలో ఏవో రెడ్ల శ్రీరామ్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డీఆర్సీ ఏడీఏ బుల్లిబాబు మాట్లాడుతూ వరి పంటలో ఎరువులు యాజమాన్యంపై వివరించారు. రైతులకు వంద శాతం రాయితీపై కందులు, మినుము విత్తనాలు పంపిణీ చేశారు. ఏఈవో పి.చంద్రమౌళి, వీఏఏ రేణుకాదేవి రైతులున్నారు.

శంఖవరం (ఆంధ్రజ్యోతి): రైతులందరూ వరినాళ్ల యాజమాన్యంపై అవగాహన కలిగి ఉండాలని ఏవో పి.గాంధీ అన్నారు. ధారమల్లాపురం, శృంగధార గ్రామాల్లో పొలం పిలుస్తోంది వరిమళ్ళు పరిశీలించి సూచనలు ఇచ్చారు. బాబూరావు, ప్రసాద్, సువర్ణరాజు పాల్గొన్నారు.


కోటనందూరు: టిజెనగరంలో చేలు పరిశీలిస్తున్న అధికారులు

సొసైటీల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే సత్యప్రభ


ప్రత్తిపాడు: పెదశంకర్లపూడిలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పెద్దిపాలెం టీడీపీ నాయకులు

ప్రత్తిపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సొసైటీల అభివృద్ధికి నూతన పాలక వర్గాలు కృషి చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన లంపకలోవ సొసైటీ డైరెక్టర్ కంచుపాటి సూరిబాబు గ్రామ టీడీపీ నాయకులు మంగళవారం పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయానికి తరలివెళ్లి మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఏసీఎస్‌ల అభివృద్ధికి పాలకవర్గాలు కృషి చేయడంతో పాటు రైతులకు రుణాలు ఇచ్చి తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దిపాలెం టీడీపీ నాయకులు పుట్టా వీర్రాజు చౌదరి, లొండా వెంకటేష్, రీసు సత్యనారాయణ, రాళ్ళ సీతారాం, కోరుకొండ శ్రీను తదితరులున్నారు.

సుపరిపాలనే లక్ష్యం

ఏలేశ్వరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమంతోపాటు సుపరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మంగళవారం పట్టణంలో 11వ వార్డులో ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, పథకాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గ పరిశీలకు డు మెట్ల రమణబాబు, పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్లు బొది రెడ్డి గోపి, అలమండ చలమయ్య, నాయకులు వైభోగుల సుబ్బారావు, బూర్లు సత్తిబాబు, బుగతా శ్రీనివాస్, సామంతుల గోపి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, పలివెల వెంకటేశ్వరరావు ఉన్నారు.

బసవేశ్వరునికి 21 ద్రవ్యాలతో అభిషేకాలు

ప్రత్తిపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి అడ్డురోడ్డు వద్ద ఉన్న అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో బసవేశ్వర స్వామికి మంగళవారం 21 ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అరుణాచలేశ్వర ఆలయ వ్యవస్థాపకులు రామానంద స్వామి ఆధ్వర్యంలో వేద పండితులు తొలుత నాయినార్ల విగ్రహాల ఎదుట హోమాలు, పూజలు నిర్వహించారు. త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మహానందికి అభిషేకాలతో పాటు పంచ హారతులు ఇచ్చారు. దళే విజయ్‌కుమార్ దంపతులు, చౌదరి రాంబాబు దంపతులు పాల్గొన్నారు.


బసవేశ్వర స్వామికి అభిషేక దృశ్యం

ముత్యాలమ్మ తల్లికి బోనాలు

జగ్గంపేట రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.కొత్తూరు గ్రామంలో ఆషాఢ మాసం పురస్కరించుకుని ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. గ్రామంలోని కన్యలు కలశాలు శిరస్సున పెట్టుకుని పురవీధుల్లో పర్యటించి ముత్యాలమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. ఉదయం నుంచి ముత్యాలమ్మ తల్లికి అభిషేక కార్యక్రమాలు ఆలయ కమిటీ నిర్వహించారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


జె.కొత్తూరులో కలశాలు నెత్తిన పెట్టుకుని గ్రామమంతా తిరుగుతున్న మహిళలు

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలుగా ఉషారాణి


ఉషారాణి

ప్రత్తిపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం ఒమ్మంగికి చెందిన బీజేపీ సీనియర్ నాయకురాలు తేజోమూర్తుల ఉషారాణి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలుగా నియమితులయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు జారీ చేసిన నియామకపు ఆదేశాలు మంగళవారం ఉషారాణికి అందాయి. ప్రత్తిపాడులో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సింగిలిదేవ్ సత్తిరాజు ఆధ్వర్యంలో ఉషారాణిని నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉషారాణిని అభినందించినవారిలో కందా వీరస్వామి, కొల్ల శ్రీనివాస్, ఇంటి బాబురావు, చింతాకుల రామకృష్ణ, మదినేబాబ్జి, నక్కా శ్రీనివాస్, అడపా కృష్ణ, సురేష్ ఉన్నారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

ప్రత్తిపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్, ఎక్సైజ్ సిబ్బంది మంగళవారం సర్కిల్ పరిధిలోని ఏలేశ్వరం, జె.అన్నవరం రహదారి మార్గంలో బైక్‌పై సారా తరలిస్తున్న గుత్తుల సురేష్‌ను అరెస్ట్ చేసి 10 లీటర్ల సారాతో బైక్ స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ వంశీరామ్,సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలు పరిశీలించిన కమిటీ సభ్యులు


పీఈ చిన్నయ్యపాలెంలో వివరాలు నమోదు చేసుకుంటున్న ఎంఈవో సుబ్బిరెడ్డి

తొండంగి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో సౌకర్యాల పరిశీలను ఏర్పాటైన కమిటీ సభ్యులు మంగళవారం మండలంలో పర్యటించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఎంఈవో 1 షేక్ బాబ్జి ఆధ్వర్యంలో ఒక టీము, ఎంఈవో 2 అనిశెట్టి సుబ్బిరెడ్డి ఆధ్వర్యంలో మరో టీము మోడల్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఉన్న సదుపాయాలు, అవసరాలు గుర్తించి నివేదికను రూపొందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, చాట్రాతి సత్యన్నారాయణ, సీఆర్పీటు ప్రతాప్‌రెడ్డి, బాబ్జీ, షీల తదితరులు వారి వెంట ఉన్నారు.

మత్స్యకార నేతల హర్షం

తొండంగి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా యల్లయ్యపేట గ్రామానికి చెందిన కోడ వెంకట రమణ, ప్రధాన కార్యదర్శిగా గంటా లక్ష్మణ్‌ల ఎంపిక పట్ల మండల మత్స్యకార నేతలు హర్షం వ్యక్తం చేశారు. మండలానికి రెండు ప్రధానమైన పదవులు దక్కడం అభినందనీయమన్నారు. మాజీ జడ్పీటీసీ చొక్కా కాశీశ్వరరావు, చొక్కా బుల్లబ్బాయి, మహేష్ చొక్కా అప్పారావు, సూరాడ రాంబాబు తదితరులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

ముద్రగడ కోసం హైదరాబాద్ రావద్దు

తనయుడు బాలు

ప్రత్తిపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను చూసేందుకు అభిమానులు, కార్యకర్తలు హైదరాబాద్ రావద్దని ముద్రగడ వీర్రాఘవరావు (బాలు) కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మా తండ్రి ఆరోగ్యం నిలకడగా ఉందని, క్షేమంగా ఉన్నారని తన సోదరుడు ముద్రగడ గిరిబాబు హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో దగ్గరుండి వైద్యవ సేవలు అందేలా చూస్తున్నారని తెలిపారు. ఆసుపత్రిలో ఎవరినీ అనుమతించడం లేదని, దయచేసి నియోజకవర్గీయులు హైదరాబాద్ వెళ్లి ఇబ్బంది పడవద్దని బాలు కోరారు.

ముద్రగడ కోసం పూజలు

ఏలేశ్వరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకోవాలని పట్టణంలో విఘ్నేశ్వరస్వామికి, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పైల విజయ్‌కుమార్, కావలి శ్రీనివాస్, ముద్రగత వీరేంద్ర, వాగు బలరాం, చిడగం సురేష్, ఉడతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు

ప్రత్తిపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూరులో మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్‌ను టాస్క్‌ఫోర్స్ ఎస్‌వో ప్రసాద్, డీఎస్‌వో గణేష్, డీపీవో మహేష్, డీపీహెచ్ఎన్ నీలవేణిల బృందం రికార్డులు పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై వారు ఆరా తీశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8,9,10 తరగతుల విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రత, బాల్యవివాహాలు, న్యూట్రీషన్, హెచ్‌బీ పరీక్షలపై వివరించారు. శాంతి ఆశ్రమం వైద్యాధికారి మురళీమోహన్ రెడ్డి, ఎంపీహెచ్ఈవో తాతబాబు, వీర్రాజు, సిబ్బంది ఉన్నారు.